

భోగాపురం పూర్తికాగానే విశాఖకు విమానాలు బంద్

- కొత్త ఎయిర్‌పోర్టు జూన్ 2026లో ప్రారంభమయితే సెప్టెంబరు నుంచి డొమెస్టిక్ విమానాలకు ఫుల్‌స్టాప్
- రక్షణ అవసరాల కోసం పూర్తిగా స్వాధీనం చేసుకోనున్న నేవీ

- 8లో

పంట పండింది!



పాతమల్లంపేటలో బాగా పండిన ఎంటీయూ 1064 రకం వరి పంట (ఫైల్ ఫొటో)

ఊహించని ధాన్యం దిగుబడితో అన్నదాతలు ఆనందం



బస్తాల్లోకి ధాన్యం నింపుతున్న రైతులు

ఎకరాకు 35-40 బస్తాలు..

- సాధారణంగా 25-30 బస్తాల దిగుబడి
- ప్రకృతి సహకరించడమే కారణమంటున్న రైతులు

గొలుగొండ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఖరీఫ్‌లో వరిసాగు చేసిన రైతులకు పంట పండింది. ముఖ్యంగా ఎంటీయూ 1064 రకాన్ని వేసిన రైతులకు ఊహించని ధాన్యం దిగుబడులు వచ్చాయి. సాధారణంగా ఎకరాకు 25-30 బస్తాల (75 కిలోల చొప్పున) ధాన్యం పండుతుంది. కానీ ఖరీఫ్‌లో ఎక్కువ మంది రైతులకు 35 నుంచి 40 బస్తాల వరకు ధాన్యం దిగుబడి వచ్చింది. ఖర్చులు పోను రూ.30 వేల వరకు మిగిలాయని చెబుతున్నారు. నారుమడిలో విత్తనాలు చల్లడం నుంచి పంట నూర్పే వరకు అన్ని వేళలా ప్రకృతి సహకరించడమే కారణమని అంటున్నారు.

గొలుగొండ మండలంలో గత ఖరీఫ్ సీజన్‌లో దాదాపు మూడు వేల ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. ఎంటీయూ 1064, ఎంటీయూ 1224, ఆర్‌జీఎల్ 2537 (శ్రీకాకుళం సన్నాలు) వంటి రకాలను వేశారు. ఎంటీయూ 1064 రకం తెగుళ్లను తట్టుకుని, అధిక దిగుబడి ఇస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు చెప్పడంతో ఎక్కువ మంది రైతులు ఈ రకం వరినే సాగు చేశారు. రిజర్వాయర్లు లేకపోవడంతో చెరువులు, గెడ్డలు, వాగుల నీరే ఆధారం. గత ఏడాది జూలై నుంచి నవంబరు వరకు మండలంలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది. వరి సాగు చేపట్టిన రైతులకు ఈ వర్షపాతం బాగా అనుకూలించింది. జూలైలో నారుమడులు పోసి, ఆగస్టులో నాట్లు వేశా

» ఖర్చులు పోను ఎకరాకు రూ.30 వేల వరకు మిగులు

రు. పంట కాలం సుమారు 120 రోజులు. డిసెంబరు మొదటి వారం నుంచి వరి కోతలు మొదలుపెట్టారు. ఈ సమయంలో బంగాళాఖాతంలో అల్పపీడనాలు, వాయుగుండాలు ఏర్పడినప్పటికీ గొలుగొండ మండలంలో అంతగా ప్రభావం చూపలేదు. దీంతో వరి కోతలు, కుప్పలు, నూర్పు పనులు సాఫీగా సాగాయి. వరి కోత సమయంలోనే పంట బాగా పండిందన్న విషయం రైతులకు ... మిగతా 8వ పేజీలో

ఎకరా 20 సెంట్లలో 52 బస్తాల దిగుబడి



- అల్లంకి నూకరాజు, పాతమల్లంపేట

నేను ఎకరాల 20 సెంట్ల భూమిని కౌలుకు తీసుకుని ఎంటీయూ 1064 రకం వరి వేశాను. విత్తనాలు వేసినప్పటికీ నుంచి పంట పండే వరకు నీరు అందుబాటులో వుంది. తెగుళ్లు సోకలేదు. మొత్తం మీద పెట్టుబడి, కూలి ఖర్చులు కలిపి రూ.45 వేల వరకు అయ్యాయి. గత నెలలో పంట నూర్పగా 52 బస్తాల దిగుబడి వచ్చింది. బస్తా రూ.1,570కి విక్రయించాను. పెట్టుబడిపోను రూ.35 వేలకుపైగా మిగిలాయి. చాలా సంతోషంగా వుంది.

పెరిగిన బెల్లం రాక

- ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో పుంజుకున్న లావాదేవీలు
- ఒక్క రోజే 9,630 బెల్లం దిమ్మలు రాక
- ప్రస్తుత సీజన్‌లో ఇవే అత్యధికం
- ధరల పెరుగుదలతో రైతులు ఆనందం



ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో రైతులు తీసుకువచ్చిన బెల్లం దిమ్మలు

అనకాపల్లి టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో సోమవారం పెద్ద మొత్తంలో బెల్లం లావాదేవీలు జరిగాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి రైతులు 9,630 బెల్లం దిమ్మలను తీసుకువచ్చి విక్రయించారు. ప్రస్తుత సీజన్ (2024-25) లో అత్యధికంగా బెల్లం దిమ్మలు రావడం ఇదే ప్రథమం. ఈ సీజన్‌లోని ఒక రోజు కూడా ఐదు వేలకు మించి బెల్లం దిమ్మలు మార్కెట్ యార్డుకు రాలేదు. అయితే గతంతో పోలిస్తే బెల్లం రాక తగ్గినట్టు వర్తకులు చెబుతున్నారు. గత రెండు సంవత్సరాలు సంక్రాంతి సమయంలో రోజూ పది వేల నుంచి 12 వేల వరకు బెల్లం దిమ్మలు మార్కెట్ యార్డుకు వచ్చినట్టు గుర్తు చేస్తున్నారు. ఇదిలావుండగా ప్రస్తుతం ఉన్న బెల్లం ధరలు రైతులకు ఆశాజనకంగానే వున్నాయి. నెల రోజుల క్రితం ఒకటో రకం బెల్లం వంద కిలోలు రూ.4,390, రెండో రకం రూ.3,800, మూడో రకం రూ.3,080లు పలికింది. ఇవే రకాలు సోమవారం వరుసగా రూ.5,100లు, రూ.4,400, రూ.3,260 పలికాయి. నెల రోజుల్లో ఒకటో రకం బెల్లం రూ.710లు, రెండో రకం రూ.600లు, మూడో రకం రూ.180 పెరిగింది. ప్రస్తుతం ఎన్టీఆర్ మార్కెట్ యార్డుకు రైతులు తీసుకువస్తున్న వస్తున్న బెల్లం దిమ్మలను కొనుగోలు చేసిన తరువాత ఏపీలోని వివిధ ప్రాంతాలతోపాటు పశ్చిమబెంగాల్, ఒడిశా, జార్ఖండ్ రాష్ట్రాలకు పంపుతున్నట్టు ప్రముఖ ఎగుమతి వర్తకుడు ఒకరు ఆంధ్రజ్యోతికి తెలిపారు. సంక్రాంతి పండుగ సమయంలో జార్ఖండ్‌లో అనకాపల్లి బెల్లానికి డిమాండ్ వుంటుందని, దీంతో అక్కడి నుంచి ఆర్డర్లు వస్తున్నాయని, దీనికితోడు సంక్రాంతి పండుగ సందర్భంగా ఇతర రాష్ట్రాల నుంచి కూడా బెల్లానికి డిమాండ్ అధికంగా వుండడంతో అక్కడి వ్యాపారుల ఆర్డర్ల మేరకు బెల్లం కొనుగోలు చేసి ఎగుమతి చేస్తున్నామని చెప్పారు.

దివ్యాంగ పింఛన్ల తనిఖీ

- బోగస్‌లు, నకిలీల ఏరివేతకు ప్రభుత్వం చర్యలు
- సంక్రాంతి పండుగ తరువాత వైద్య బృందాలు పర్యటన
- తొలి దశలో శాశ్వత వైకల్య పింఛన్లపై దృష్టి
- తరువాత ఇతర కేటగిరీల్లో తనిఖీలు
- ప్రభుత్వ నిర్ణయంతో బోగస్ లబ్ధిదారుల్లో గుబులు



ఎలమంచిలి మండలం పురుషోత్తపురంలో పింఛన్‌దారుల వివరాలు పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ శచీదేవి, డీఎల్‌డీవో ఎస్.మంజులావాణి (ఫైల్ ఫొటో)

చోడవరం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో అనర్హులకు అడ్డగోలుగా మంజూరైన దివ్యాంగ పింఛన్లపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. సంక్రాంతి పండుగ తరువాత గ్రామాల్లో ప్రత్యేక వైద్య బృందాలతో తనిఖీలు చేపట్టాలని నిర్ణయించింది. తొలుత శాశ్వత వైకల్య పింఛన్లపై దృష్టి సారిస్తారు. అనంతరం ఇతర కేటగిరీల్లో కూడా తనిఖీలు నిర్వహించి అనర్హులను గుర్తించి రద్దు చేస్తారు. ఈ విషయం తెలుసుకున్న బోగస్ లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

నాడు అధికారంలో ఉన్న వైసీపీ నేతలకు, వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్లకు డబ్బులు ఇచ్చి దివ్యాంగ సర్టిఫికెట్లు పొంది ప్రతినెలా వేలాది రూపాయలు పింఛన్లుగా తీసుకుంటున్న నకిలీల భరతం పట్టాలని కూటమి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. బోగస్ దివ్యాంగుల ఏరివేతకు మండలాల వారీగా వైద్యులు, అధికారుల బృందం ఇంటింటా పరిశీలన చేయనున్నది. సంక్రాంతి పండుగ అనంతరం సర్వే ప్రారంభం అవుతుందని తెలిసింది. వైద్యులు, అధికారులతో కూడిన బృందాలు తమకు కేటాయించిన మండలాల్లోని గ్రామాల్లో పర్యటించి దివ్యాంగ పింఛన్‌దారులను క్షుణ్ణంగా తనిఖీ చేయనున్నారు. తొలిదశలో మంచానికి పరిమితమై, శాశ్వత వైకల్యం వున్నట్టు జాబితాల్లో పేర్లు వున్న వారి ఇళ్లకు వెళ్లి పరిశీలిస్తారు. తరువాత మిగిలిన కేటగిరీల దివ్యాంగులను తనిఖీ చేస్తారు. వైద్య నిపుణుల బృందం సమక్షంలో మరోసారి వైకల్యాన్ని నిర్ధారించే అవకాశం ఉందని చెబుతున్నారు. అనర్హులను ఏరివేసే సమయంలో అర్హులైన ఒక్క దివ్యాంగునికి కూడా అన్యాయం జరగకుండా చూసేలా అధికారులకు మార్గదర్శనం చేసినట్టు తెలిసింది. పింఛన్లు పొందుతున్న దివ్యాంగులను మరోసారి తనిఖీ చేయాలన్న ప్రభుత్వం నిర్ణయం.. బోగస్ సర్టిఫికెట్లతో పింఛన్ పొందుతున్న వారిలో గుబులు రేపుతున్నది.

దివ్యాంగులకు ఇచ్చే పింఛన్ సొమ్మును గత ప్రభుత్వం పెంచడంతో ఎలాంటి వైకల్యం లేని వారు సైతం డాక్టర్లకు ముడుపులు ఇచ్చి, వైసీపీ నేతలతో సిఫారసు చేయించుకుని దివ్యాంగ సర్టిఫికెట్లు పొందారు. ఈ తరహా పింఛన్లు వైసీపీ ఐదేళ్లపాలనలో విపరీతంగా పెరిగిపోయాయి. ఇది ఏ స్థాయిలో వుందంటే.. దివ్యాంగుల కేటగిరీలో పింఛన్ తీసుకుంటున్న వారిని చూసి.. 'మీరు దివ్యాంగులా!' అని పింఛన్ డబ్బులు పంపిణీ చేసే సచివాలయాల సిబ్బంది ఆశ్చర్యంతో ప్రశ్నిస్తున్నారు. కొందరు శారీరకంగా బాగానే ఉన్నప్పటికీ దివ్యాంగుల సర్టిఫికెట్ తీసుకుని పింఛన్ పొందుతున్నారు. మరికొందరు గుండె ఆపరేషన్ జరగపోయినప్పటికీ, శస్త్రచికిత్స చేయించుకుని కదలలేని స్థితిలో ఉన్నట్టు సదరం సర్టిఫికెట్ ... మిగతా 8వ పేజీలో

అనర్హులను ఏరివేయాల్సిందే

శరగడం నాగభూషణం, అధ్యక్షుడు, దివ్యాంగుల సంక్షేమ సంఘం, చోడవరం



బోగస్ సదరం సర్టిఫికెట్లతో మంజూరైన దివ్యాంగ పింఛన్లను రద్దు చేయడానికి సర్వే నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించడం హర్షణీయం. బోగస్ దివ్యాంగ పింఛనుదారుల వల్ల అర్హులైన దివ్యాంగులకు అన్యాయం జరుగుతున్నది. బోగస్ పింఛన్లను ఏరివేయాలని మేము చాలా కాలంగా కోరుతున్నాం. నకిలీల ఏరివేత సందర్భంగా అర్హులైన దివ్యాంగులకు అన్యాయం జరగకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

రైతు బజార్ కలేనా?

నర్సీపట్నంలో బోర్డుకే పరిమితం

- ఎనిమిదేళ్ల క్రితం పెదబొడ్డేపల్లిలో ఏఎంసీ స్థలంలో ఏర్పాటు
- డ్వాక్రా సంఘాలు, కొంతమంది రైతులకు దుకాణాలు కేటాయింపు
- పట్టణానికి ఒకవైపున ఉండడంతో కూరగాయ రైతులు విముఖత
- కరోనా సమయంలో ఇందిరా మార్కెట్‌ను అక్కడికి తరలించిన అధికారులు
- అనంతరం దుకాణాలను అద్దెకు ఇచ్చిన వైనం
- ఖాళీగా ఇందిరా మార్కెట్
- పట్టణం నడిబొడ్డున ఉండడంతో ఇక్కడ రైతు బజార్ ఏర్పాటు చేయాలని పలువురు వినతి



పెదబొడ్డేపల్లిలో నిర్మించిన రైతుబజార్. ప్రస్తుతం ఇక్కడ షాపులన్నింటినీ కూరగాయల వ్యాపారులకు అద్దెకు ఇచ్చారు.

నర్సీపట్నం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నంలో రైతు బజార్‌ను వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులు నిర్వీర్యం చేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పెదబొడ్డేపల్లిలోని వ్యవసాయ మార్కెట్ యార్డు స్థలంలో రైతు బజార్ బోర్డు పెట్టి కూరగాయల మార్కెట్ నిర్వహిస్తున్నారు. అయితే ఈ ప్రాంతం పట్టణానికి ఒకవైపున వుంటుందని, అదే నర్సీపట్నం ఇందిరా మార్కెట్లో రైతు బజార్ ఏర్పాటు చేస్తే అన్ని ప్రాంతాల వారికి అందుబాటులో వుంటుందని కూరగాయ రైతులు, వినియోగదారులు అభిప్రాయపడుతున్నారు.

నర్సీపట్నం వ్యవసాయ మార్కెట్ యార్డుకు పెదబొడ్డేపల్లిలో (కోటవురట్ల వెళ్లే రోడ్డు) 2.5 ఎకరాల స్థలం వుంది. ఇక్కడ 2009వ సంవత్సరంలో పండ్ల వ్యాపారుల కోసం 18 షాపులు నిర్మించారు. అయితే వ్యాపారులు ఎవరు రాకపోవడంతో దుకాణాలు నిరుపయోగంగా మారాయి. 2017లో తెలుగుదేశం పార్టీ అధికారంలో వున్నప్పుడు స్థానిక ఎమ్మెల్యే, మంత్రి ... మిగతా 8వ పేజీలో

ప్రధాని పర్యటనను విజయవంతం చేద్దాం

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- రవాణా, భోజనం, ఇతర ఏర్పాట్లు పక్కాగా ఉండాలి
- మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశం



సమీక్షా సమావేశంలో మంత్రులు నాదెండ్ల మనోహర్, వంగలపూడి అనిత, ఎంపీ సీఎం రమేశ్, కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ల చైర్మన్లు, అధికారులు

అనకాపల్లి కలెక్టరేట్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విశాఖ పర్యటనను విజయవంతం చేయడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విశాఖ బహిరంగ సభకు జిల్లా నుంచి ప్రజలను తరలించేందుకు ఏర్పాటు చేసే ఆర్టీసీ బస్సుల పర్యవేక్షణకు కంట్రోల్‌రూం ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ఆహారం, తాగునీరు, రవాణా విషయంలో ప్రజలు ఎటువంటి ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. జిల్లాలో ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుకు, బల్క్‌డ్రగ్ పార్కుకు ప్రధాని వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తారని, సుమారు రూ.90 వేల కోట్లతో ఏర్పాటయ్యే వీటిల్లో వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు.

హోం మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ, మండలాల నుంచి ప్రజలను తీసుకెళ్లే వాహనాలు ఏ రూట్‌లో విశాఖ వెళ్లాలి, అక్కడ ఏ ప్రదేశాల్లో వాహనాలను పార్కింగ్ చేయాలో ముందుగానే రూటు మ్యాప్ తయారు చేసుకోవాలని చెప్పారు. అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ మాట్లాడుతూ, అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రధాన మోదీ పర్యటనను విజయవంతం చేయాలని చెప్పారు. కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ, అనకాపల్లి జిల్లా నుంచి 840 బస్సులు ఏర్పాటు చేశామని, వీటిల్లో 42 వేల మంది ప్రధాని సభకు వెళ్లేలా చర్యలు చేపట్టామన్నారు. బస్సులు ఉదయం బయలుదేరి మధ్యాహ్నానికి విశాఖ చేరతాయని, అల్పాహారాన్ని బస్సులోనే అందిస్తామని, విశాఖ చేరిన తరువాత బస్సు వద్దనే భోజనం ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, బండారు సత్యనారాయణమూర్తి, సుందరపు విజయ్‌కుమార్, పంచకర్ల రమేశ్‌బాబు, కేఎస్ఎన్ఎస్ రాజు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, అధికారులు పాల్గొన్నారు.

మళ్లీ వైరస్ టెన్షన్



- దేశంలో మూడు హెచ్ఎంపీవీ కేసులు నమోదు కావడంతో కేంద్రం అలర్ట్
- సీఎం టెలీ కాన్ఫరెన్స్
- తగిన జాగ్రత్తలు తీసుకోవాలంటూ ఆదేశాలు
- కేజీహెచ్‌లో 20 పడకలతో ప్రత్యేక వార్డు సిద్ధం చేస్తున్న అధికారులు

విశాఖపట్నం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కరోనా వైరస్ పుట్టిన చైనా నుంచి మరో మహమ్మారి వ్యాప్తి చెందుతుండడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. గడిచిన కొద్దిరోజులుగా చైనాలో హ్యూమన్ మెటా న్యూమో వైరస్ (హెచ్ఎంపీవీ) వ్యాప్తి చెందుతోంది. మన దేశంలో కూడా సోమవారం మూడు కేసులు నమోదు కావడంతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోమవారం సాయంత్రం ఆరోగ్య శాఖ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశాలు జారీచేశారు. ఈ క్రమంలో కేజీహెచ్‌లో 20 పడకలతో ఐసోలేషన్ వార్డును సిద్ధం చేసుకోవాలని అధికారులకు సమాచారం అందింది. క్యాజువాలిటీపైన మొదటి అంతస్థులో 20 పడకలతో వార్డును సిద్ధం చేస్తున్నట్టు కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద తెలిపారు. ఎటువంటి పరిస్థితులు ఎదురైనా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

జిల్లా ఓటర్లు 12,91,044

- పురుషులు 6,27,984, మహిళలు 6,63,032, థర్డ్ జెండర్ 28
- తుది జాబితాను విడుదల చేసిన కలెక్టర్
- ముసాయిదా జాబితా కంటే 1,174 మంది ఓటర్లు అధికం
- సర్వీసు ఓటర్లు 3,987 మంది



అనకాపల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక సంక్షిప్త సవరణ-2025 మేరకు తుది ఓటర్ల జాబితాను జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ సోమవారం విడుదల చేశారు. దీని ప్రకారం జిల్లాలో మొత్తం 12,91,044 మంది ఓటర్లు (సర్వీసు ఓటర్లు కాకుండా) ఉన్నారు. వీరిలో పురుషులు 6,27,984 మంది, మహిళలు 6,63,032 మంది, ట్రాన్స్‌జెండర్లు 28 మంది ఉన్నారు. పురుషులతో పోల్చితే మహిళలు 35,048 మంది ఎక్కువగా ఉన్నారు. కాగా గత సంవత్సరం అక్టోబరు 29న విడుదలచేసిన ప్రత్యేక సంక్షిప్త సవరణ-2025 ... మిగతా 8వ పేజీలో

తుది జాబితా మేరకు జిల్లాలో నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు

అసెంబ్లీ నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	మహిళలు	థర్డ్ జెండర్	మొత్తం
చోడవరం	243	1,05,698	1,12,023	7	2,17,728
మాడుగుల	235	92,028	96,893	2	1,88,923
అనకాపల్లి	251	1,03,140	1,10,728	5	2,13,873
ఎలమంచిలి	246	1,00,683	1,06,339	8	2,07,030
పాయకరావుపేట	292	1,23,528	1,27,563	2	2,51,093
నర్సీపట్నం	262	1,02,907	1,09,486	4	2,12,397
మొత్తం	1,529	6,27,984	6,63,0328	28	12,91,044
సర్వీసు ఓటర్లు		3,851	136	0	3,987

శ్రీరామునిగా పాండురంగడు



పాయకరావుపేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాధారుక్మిణి సహిత పాండురంగస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా సోమవారం పాండురంగస్వామి, అమ్మవార్లు సీతారాములుగా భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధానార్చకులు యి.కృష్ణస్వామి స్వామివారికి వేకువజామున సుప్రభాతసేవ, అభిషేకాలు నిర్వహించి స్వామివారిని శ్రీరామచందునిగా, అమ్మవారిని సీతగా, లక్ష్మణ స్వామిగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అశ్వ వాహనంపై గరుడాచలవాసుడు



నక్కపల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక క్షేత్రంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా సోమవారం అశ్వవాహనంపై గరుడాద్రివాసుని తిరువీధి సేవ కన్నుల పండువగా జరిగింది. ముందుగా ఆలయంలో అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అశ్వ వాహనంపై ఉభయదేవేరులతో కూడిన స్వామి వారిని, పల్లకీలో గోదాదేవి అమ్మవారిని అలంకరించి తిరువీధుల్లో ఊరేగించారు. ఆలయంలో గోదాదేవి అమ్మవారి సన్నిధి వద్ద తిరుప్పావై పాశుర విన్నపం చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

» ఆర్‌బీఎస్‌కే.ప్రోగ్రామింగ్ ఆఫీసర్ డాక్టర్ ప్రశాంతి



పాయకరావుపేట పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా ఆర్‌బీఎస్‌కే.ప్రోగ్రామింగ్ ఆఫీసర్ డాక్టర్ ప్రశాంతి

పాయకరావుపేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య సమస్య ఉన్న పిల్లలను సిబ్బంది గుర్తించి అవసరమైన వైద్యం అందేలా చర్యలు చేపట్టాలని రాష్ట్రీయ బాలల స్వస్థ, అసంక్రమిత వ్యాధుల ప్రోగ్రామింగ్ జిల్లా అధికారిణి డాక్టర్ ప్రశాంతి అన్నారు. సోమవారం ఆమె పట్టణ పీహెచ్‌సీని సందర్శించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్‌బీఎస్‌కే కార్యక్రమం అమలుకు సంబంధించిన రికార్డులు తనిఖీచేశారు. అనంతరం మండలంలోని పీఎల్.పురం ప్రాథమిక పాఠశాలను సందర్శించి ఆర్‌బీఎస్‌కే కార్యక్రమం అమలుపై ఉపాధ్యాయుల నుంచి వివరాలు సేకరించారు. పిల్లల ఆరోగ్యానికి సంబంధించిన రికార్డులు తనిఖీచేశారు. అదేవిధంగా గ్రామంలో పలు ఇళ్లకు వెళ్లి పిల్లల ఆరోగ్యానికి సంబంధించి తల్లులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలు ఆరోగ్యంగా ఉండేలా చూసుకోవాలన్నారు. అదేవిధంగా ఆరోగ్య సిబ్బంది కూడా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఆమె వెంట పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ సుభాష్, డాక్టర్ వీఎస్.సౌందర్య, ఎంపీహెచ్‌ఈఓ పీవీ.రమణ, ఎంపీహెచ్‌ఎస్ ఎం.నాగేశ్వరరావు, ఏఎన్‌ఎం వీఎంఎస్.లక్ష్మి, కళ్యాణి, ఆశావర్కర్లు ఉన్నారు.

అరట్లకోటలో నూతన కల్వర్టు నిర్మాణం

» ఆంధ్రజ్యోతి ఎఫెక్టు



అరట్లకోట పొలాలకు కల్వర్టును నిర్మిస్తున్న దృశ్యం

పాయకరావుపేట రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అరట్లకోట పంచాయతీ కార్యాలయం పక్క నుంచి పొలాలకు వెళ్లే రోడ్డులో సాగునీటి కాలువపై కూలిన కల్వర్టు స్థానే కొత్తది నిర్మించారు. గత నెలలో 'ఆంధ్రజ్యోతి'లో 'కూలిన కల్వర్టు, రైతుల ఇబ్బందులు' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించిన సర్పంచ్ అప్పల నర్స వెంటనే కల్వర్టును నిర్మించారు. కల్వర్టు నిర్మాణంతో రైతులు, గ్రామస్థులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

ఆటో వర్కర్ల సదస్సును విజయవంతం చేయండి

ఎలమంచిలి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆటో, మోటారు కార్మికుల సమస్యలపై ఈనెల 7వ తేదీన ఎలమంచిలిలో నిర్వహించనున్న సదస్సును విజయవంతం చేయాలని ఆటో, మోటారు వర్కర్స్(ఏఐటీయూసీ)జిల్లా కార్యదర్శి గనిశెట్టి ఏసుదాసు అన్నారు. సోమవారం పట్టణంలోని ఆటో స్టాండ్ వద్ద కార్మిక ప్రతినిధులతో కలిసి సదస్సు కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలతో రాష్ట్రంలో ఆటో, మోటారు కార్మికులు అనేక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మోటారు కార్మికుల సంక్షేమం దృష్టిలో ఉంచుకుని నూతన మోటారు చట్టాన్ని ఉపసంహరించాలని కోరారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షుడు అల్లిమళ్ల నాగు, బాషా, విశ్వనాథం, నగిరెడ్డి శివ పాల్గొన్నారు.

ట్రై సైకిల్‌కు ఆర్థిక సాయం



గోవిందకు నగదు అందజేస్తున్న దృశ్యం

మునగపాక, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ లైన్‌మన్‌గా పనిచేస్తూ ప్రమాదానికి గురైన బొడ్డేడ గోవిందకు రూ.10వేలు ఆర్థిక సాయం చేసినట్టు సేవా వికాస్ సంస్థ సభ్యుడు పి.వీరఅప్పారావు తెలిపారు. సుమారు 20 సంవత్సరాల క్రితం ఉమ్మలాడలో లైన్‌మన్‌గా పని చేస్తూ స్తంభం నుంచి కింద పడిపోవడంతో మంచానికే గోవింద పరిమితమయ్యాడు. గోవింద పడుతున్న ఇబ్బందిని గుర్తించిన సంస్థ సోమవారం ట్రైసైకిల్ కొనుగోలుకు పది వేలు నగదు అందజేశామన్నారు.

మునగపాక అభివృద్ధిపై దృష్టి

» సర్పంచ్ డి. అప్పారావు

మునగపాక, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పార్టీలకు అతీతంగా గ్రామాభివృద్ధిపై దృష్టి సారిద్దామని మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు పిలుపునిచ్చారు. స్థానిక గ్రామ పంచాయతీ ఆవరణలో సోమవారం జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ గ్రామంలో పలు అభివృద్ధి పనులు జరగాల్సి ఉందన్నారు. జనసేన పార్టీ మండల అధ్యక్షుడు టెక్కలి పరశరాం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలలు కాలంలోనే పంచాయతీలకు పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తోందన్నారు. రాష్ట్ర తెలుగురైతు కార్యనిర్వాహక కార్యదర్శి దాడి ముసిలినాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నందున అవసరమైన పనులకు తీర్మానాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పెంటకోట సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఎలమంచిలి మునిసిపాలిటీ అభివృద్ధిపై ఎమ్మెల్యే సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయకుమార్

ఎలమంచిలి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి మునిసిపాలిటీ అభివృద్ధిపై సోమవారం విశాఖలో ప్రజారోగ్యశాఖ ఉన్నతాధికారులతో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. మునిసిపాలిటీలో త్రాగునీరు, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, ఇతర పథకాలపై చర్చించారు. త్వరలో అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తానని ఎమ్మెల్యే విజయకుమార్ అన్నారు. ఈ సమీక్ష సమావేశంలో ప్రజారోగ్య శాఖ ఎస్ఈ రాయలబాబు, ఈఈ సుగుణాకర్, డీఈఈ మహేష్, మునిసిపల్ డీఈఈ, మాధవ్ పాల్గొన్నారు.

బల్క్‌డ్రగ్ పార్కు వద్దంటూ ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వాసితులతో ఆందోళన చేస్తున్న నేతలు

నక్కపల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న బల్క్‌డ్రగ్ పార్కు వద్దంటూ సోమవారం నక్కపల్లిలో నిర్వాసిత రైతులతో కలిపి సీపీఎం, వైసీపీ నాయకులు ఆందోళన చేపట్టారు. రాజయ్యపేటలో ఈనెల 8న ప్రధాని మోదీ బల్క్‌డ్రగ్ పార్కుకు వర్చువల్ శంకుస్థాపన చేస్తున్నారని, దీనిని తాము వ్యతిరేకిస్తున్నామని వారు పేర్కొన్నారు. వైసీపీ నాయకుడు వీసం రామకృష్ణ, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు నేతృత్వంలో పలు గ్రామాలకు చెందిన నిర్వాసిత రైతులు, రైతు సంఘ ప్రతినిధులు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. పర్యావరణానికి, తీర ప్రాంతానికి, ప్రకృతికి హాని చేసే బల్క్‌డ్రగ్ వద్దంటూ నినాదాలు చేపట్టారు. శంకుస్థాపనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం నిర్వాసిత రైతులందరికీ ప్యాకేజీ,పరిహారం ఇవ్వకుండా బల్క్‌డ్రగ్ యూనిట్లను ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. అనంతరం తహసీల్దార్ నర్సింహమూర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గంటా తిరుపతిరావు, తళ్లా భార్గవ్, సూరకాసుల గోవింద్, ఎం.రాజేశ్,మహేశ్ బాబు, కారే భూలోక, తదితరులు పాల్గొన్నారు.

బల్క్‌డ్రగ్ పార్కుకు శంకుస్థాపన రేపు : మంత్రి అనిత



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అనిత

నక్కపల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లిలో బల్క్‌డ్రగ్ పార్కుతోపాటు పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధాని నరేంద్ర మోదీ విశాఖ నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తారని హోం మంత్రి వంగలపూడి అనిత చెప్పారు. ఈ నెల 8వ తేదీన ప్రధాని మోదీ విశాఖ పర్యటన నేపథ్యంలో నక్కపల్లి సమీపంలోని తన నివాసంలో నియోజకవర్గానికి చెందిన కూటమి పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రధాని పర్యటనను విజయవంతం చేయాల్సిన బాధ్యత కూటమి నాయకులపై వుందన్నారు. గత వైసీపీపాలనలో పాయకరావుపేట నియోజకవర్గానికి ఒక పరిశ్రమ కూడా రాలేదని, చేసిన కొద్దిపాటి అభివృద్ధి పనులకు బిల్లులు సైతం ఇవ్వలేదన్నారు.

నిర్వాసితులకు 75 శాతం ఉద్యోగాలు ఇవ్వాలి

» సీపీఎం నాయకులు లోకనాథం, కోటేశ్వరరావు



ఎన్‌టీపీసీ హబ్ ఎదుట విలేకర్లతో మాట్లాడుతున్న సీపీఎం నేతలు

అచ్యుతాపురం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పూడిమడక వద్ద నిర్మిస్తున్న ఎన్‌టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ హబ్ ప్రాజెక్ట్‌లో నిర్వాసితులకు 75 శాతం ఉద్యోగాలివ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె. లోకనాథం, అనకాపల్లి జిల్లా కార్యదర్శి జి. కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం బృందం నిర్మించబోయే ప్రాజెక్టు ప్రాంతంలో సీపీఎం నేతలు పర్యటించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఈప్రాజెక్ట్ ప్రభుత్వ రంగ సంస్థ కావడం వల్ల తాము స్వాగతిస్తున్నామని, అయితే హైడ్రోజన్ నీరు, గాలి, సూర్యరశ్మిల్లో దేని నుంచి ఉత్పత్తి చేస్తారో ముందుగా ప్రజలకు తెలియజేయాలన్నారు.

పూడిమడక సముద్రంలో కర్మాగారాల వ్యర్థ జలాలు కలియడంతో మత్స్య సంపద నశిస్తున్నదన్నారు. ఇక్కడే ఈప్రాజెక్టు నిర్మిస్తున్నందున ఆ గ్రామస్థులకు ఉపాధి కల్పించాలన్నారు. ఎన్‌టీపీసీ అధికారులు మత్స్యకార గ్రామాల్లో ప్రజాభిప్రాయ సేకరణ చేసి నిర్వాసితులకు భరోసా కల్పించాలన్నారు. కార్యక్రమంలో రొంగలి రాము, చేపల తాతలు, కె.సోమినాయుడు, కర్రి అప్పారావు, ఆర్.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ మీనా మృతి



మజ్జి మీనా(ఫైల్)

ఎలమంచిలి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలోని కొక్కిరాపల్లి వార్డుకు చెందిన మాజీ కౌన్సిలర్ మజ్జి మీనా(30) ప్రమాదవశాత్తూ ఇంటి వద్ద మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆదివారం సాయంత్రం ఇంటిని శుభ్రం చేసేందుకు పనులు చేస్తుండగా ప్రమాదానికి గురై మృతి చెందినట్టు తెలిపారు. ఈమె గత మునిసిపల్ పాలకవర్గంలో కొక్కిరాపల్లి వార్డు కౌన్సిలర్‌గా సేవలందించారు. మీనా మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆమె మృత దేహాన్ని పలువురు ప్రముఖులు సందర్శించి నివాళులర్పించారు. మీనాకు భర్తతోపాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పాఠశాలల అభివృద్ధికి కృషిచేయాలి

» ఎంఈఓ కేఎన్.గాంధీ



శిక్షణతరగతుల్లో మాట్లాడుతున్న ఎంఈఓ కేఎన్.గాంధీ

పాయకరావుపేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఎస్‌ఎంసీ చైర్మన్లు, హెచ్‌ఎంలు సమన్వయంతో కృషిచేయాలని ఎంఈఓ కేఎన్.గాంధీ అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్‌ఎంసీ చైర్మన్లు, హెచ్‌ఎంలకు పాఠశాలల అభివృద్ధి, మెరుగైన విద్యాబోధన, ఎస్‌ఎంసీ చైర్మన్ల విధులు, బాధ్యతలపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులకు సరిపడ వసతులు, సౌకర్యాల ఏర్పాటుకు ఎస్‌ఎంసీ చైర్మన్లు, హెచ్‌ఎంలు కృషిచేయాలన్నారు. అదేవిధంగా పాఠశాలల్లో పరిశుభ్రత, విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన, మధ్యాహ్న భోజన పథకం అమలు, బాత్‌రూమ్‌లు శుభ్రంగా ఉంచడం, బాలికల సంరక్షణ తదితర అంశాలను ఎంఎస్‌సీ చైర్మన్, సభ్యులు తరచూ పరిశీలించాలన్నారు. అనంతరం రిసోర్స్ పెర్సన్స్ హరికృష్ణ, సతీష్, రమణ మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, ఎస్‌ఎంసీ చైర్మన్ల విధులు, బాధ్యతలపై శిక్షణ ఇచ్చారు. సమావేశంలో ఎంఈఓ-2 రమేశ్ పాల్గొన్నారు.

పల్లెల్లో దట్టంగా పొగమంచు

పాయకరావుపేట రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాలలో పొగమంచు దట్టంగా కురుస్తోంది. సాయంత్రం నుంచి ఉదయం ఎనిమిది గంటల వరకు దట్టంగా కురుస్తున్న పొగమంచుతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. వృద్ధులు, పిల్లలు అనారోగ్యం పాలవుతున్నారు. రోడ్లపై వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో లైట్లు వేసుకొని వెళుతున్నారు.

తీరంలో కనిపించని వేల్ షార్క్

అచ్యుతాపురం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి):పూడిమడక శివారు కడపాలెం మత్స్యకారుల వలకు ఆదివారం చిక్కిన వేల్‌షార్క్ సోమవారం ఉదయానికి కనిపించలేదు. భారీ షార్క్ గురించి పత్రికల్లో వార్తలు రావడంతో దీనిని చూడడానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి పలువురు సీతపాలెం బీచ్ వద్దకు వచ్చారు. అటవీ శాఖ అధికారులు కూడా అక్కడికి వెళ్లారని తెలిసింది. కానీ సీతపాలెం బీచ్‌లో ఎక్కడా వేల్ షార్క్ కనిపించలేదు. పోటు సమయంలో ఇది నీటితోపాటు సముద్రంలోకి వెళ్లిపోయి వుంటుందని మత్స్యకారులు చెబుతున్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు : డీటీ



రాజుపేట రెవెన్యూ సదస్సులో అధికారులు

మునగపాక, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): అన్ని రకాల భూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం గ్రామస్థాయి రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని రీ-సర్వే డీటీ పడాల్ అన్నారు. మండలంలో రాజుపేటలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ కిలాడి దేముడు, రెవెన్యూ కార్యదర్శి, సర్వేయర్, సిబ్బంది పాల్గొన్నారు.

రాంబిల్లిలో..

రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకే గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్టు డిప్యూటీ తహసీల్దార్ వెంకట్ అన్నారు. మండలంలోని కొత్తూరులో సోమవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో రైతులు ఇచ్చిన అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సకాలంలో పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ త్రిమూర్తులు, మాజీ సర్పంచ్ సాయివరప్రసాద్, వీఆర్వో కుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పీఏ తొలగింపు అనిత నిజాయితీకి నిదర్శనం

» సివిల్ సప్లయి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బోడపాటి శివదత్

నక్కపల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): అవినీతికి పాల్పడుతున్నట్టు ఆరోపణలు వచ్చిన వెంటనే వ్యక్తిగత పీఏను రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత తొలగించారని రాష్ట్ర సివిల్ సప్లయి కార్పొరేషన్ డైరెక్టర్ బోడపాటి శివదత్ అన్నారు. సోమవారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గానికి అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి హోం మంత్రి అనిత కార్యాచరణ ప్రణాళికలు రూపొందించారన్నారు. ఆమె హయాంలో రానున్న కాలంలో ఎన్నో పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయని, బల్క్‌డ్రగ్ వల్ల వేలాది మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయని చెప్పారు.

కార్యక్రమంలో జనసేన నాయకులు ఆకేటి గోవిందరావు, పాము గణేశ్, కురందాసు అప్పలరాజు, యలమంచిలి చంద్రరావు, పిక్కిస్వామి, బంగారి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ చరిత్ర కాంగ్రెస్‌లో పాల్గొన్న నాగేశ్వరరావు

నక్కపల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా గూడూరు ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 4,5 తేదీల్లో నిర్వహించిన 47వ ఏపీ చరిత్ర కాంగ్రెస్ సమావేశాల్లో మండలంలోని చందనాడ గ్రామానికి చెందిన హిస్టరీ అధ్యాపకుడు కాపారావు నాగేశ్వరరావు పాల్గొని తన నివేదికను సమర్పించారు. ఈయన చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకునిగా పనిచేస్తున్నారు. గూడూరు సదస్సులో ఉమ్మడి విశాఖజిల్లాకు చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు మలిమాడుగుల జగన్నాథరావు గురించి నాగేశ్వరరావు చేసిన ప్రసంగం అక్కడి వారిని ఆకట్టుకుంది. సైమన్ కమిషన్ గో బ్యాక్ ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో జగన్నాథరావు చేసిన పోరాటం గురించి తాను వివరించానని చెప్పారు. ఈ మేరకు ఆయనకు పురస్కారాన్ని నిర్వాహకులు అందజేశారు.

ప్రధాని మోదీ సభకు భారీగా బీజేపీ శ్రేణులు



బీజేపీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న కాశీశ్వరరావు

మునగపాక, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం పర్యటనకు విచ్చేస్తున్న ప్రధాని మోదీ సభకు మండలం నుంచి భారీగా బీజేపీ శ్రేణులు తరలి వెళుతున్నట్టు ఆ పార్టీ మండల అధ్యక్షుడు మళ్ల కాశీశ్వరరావు అన్నారు. స్థానిక అయ్యప్పస్వామి ఆలయం వద్ద సోమవారం జరిగిన బీజేపీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీలో చేరేందుకు పలువురు ఆసక్తి చూపుతున్నారన్నారు. త్వరలో నియామకం జరగనున్న సహకార సంఘాల కమిటీల్లో బీజేపీ శ్రేణులకు సముచిత స్థానం ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా బీజేపీలో చేరిన కొయిలాడ ఎర్రయ్యనాయుడు, మళ్ల వెంకటరమణకు కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో యల్లపు రాజేశ్వరరావు, భార్గవాచార్యులు, వేగి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపట్నం సముద్ర తీరంలో ఇసుక తవ్వకాలు



కొత్తపట్నం తీరంలో ఇసుక తవ్వకాలు చేపడుతున్న ప్రదేశం

రాంబిల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపట్నం సముద్ర తీరంలో ఇసుక తవ్వకాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇక్కడ తవ్వకాలు చేపట్టి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా అక్రమార్కులు ఇసుక తవ్వకాలు చేపడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. దూరాన్ని బట్టి ట్రాక్టర్ ఇసుకను రూ.3,500 నుంచి రూ.5వేలు వరకు విక్రయిస్తున్నారు. ఫారెస్టు భూముల్లో ఇసుక తవ్వకాలు చేపడుతున్నా అటవీ అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి సముద్ర తీరం వెంబడి ఇసుక తవ్వకాలు జరపకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పూడిమడకలో అక్రమ లేఅవుట్ పనులు ఆపాలంటూ వీఎంఆర్డీఏ అధికారులు నోటీసులు



కిరణ్‌కి ఎండార్స్‌మెంట్ ఇస్తున్న అధికారి

అచ్యుతాపురం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పూడిమడక సర్వే నంబర్లు 86, 126, 127లలో అక్రమ లేఅవుట్ పనులు ఆపాలంటూ వీఎంఆర్‌డీఏ అధికారులు పంచాయతీ కార్యదర్శికి నోటీసులు జారీ చేశారు. ఈ అక్రమ లేఅవుట్‌పై పూడిమడక మత్స్యకార నాయకుడు ఎరిపల్లి కాసులు (కిరణ్) వీఎంఆర్‌డీఏ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఈనెల రెండో తేదీ అధికారులు విచారణ జరిపారు. ఈ సర్వే నంబర్ల పరిధిలో ఎటువంటి నిర్మాణాలు జరపకూడదని, జరిపితే వెంటనే చర్యలు తీసుకోమని పూడిమడక పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ఒక కాపీని కిరణ్‌కి కూడా అందజేశారు.

180 మందికి వైద్య పరీక్షలు



ధర్మవరం అగ్రహారంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ఎస్.రాయవరం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం అగ్రహారంలో అచ్యుత్ హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో వైద్యులు 180 మందికి పరీక్షించారు. విశాఖకు చెందిన సాగర దుర్గ, సింహాద్రి ఆస్పత్రిలతోపాటు పాయకరావుపేటకు చెందిన హైమ నేత్రాలయం వైద్యులు బి.కృపా సాహిత్య, వి. శ్రీరమ్య, షేక్ ఫాతిమ బేగం రోగులకు పరీక్షలు జరిపి, అవసరమైన వారికి మందులు అందజేశారు. వీరిలో 36 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించినట్టు ఫౌండేషన్ చైర్మన్ అచ్యుత్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో హైమ హాస్పటల్ పీఆర్‌వో రవి, గ్రామ ఉపసర్పంచ్ కలిగట్ల మాణిక్యం, జనసేన మండల నేత సేనాపతి బాబూరావు, బండి నాగేశ్వరరావు, పినపాత్రుని గణేష్, అశోక్, రాజు, ప్రసాద్ పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సుతో తల్లిదండ్రుల ఆందోళన



అద్దం లేని బస్సు

పాయకరావుపేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : పాయకరావుపేటలో ఫిట్‌నెస్ లేని ఓ ప్రైవేటు స్కూల్ బస్సులో విద్యార్థులను తరలించడం తల్లిదండ్రులను ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన స్కూల్ బస్సు వెనుక డోర్ ఒకదానికి అద్దం లేకున్నా విద్యార్థులను తరలిస్తున్నారు. దురదృష్టవశాత్తూ ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యార్థులను తీసుకెళుతున్న బస్సులకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టి అన్ని రకాలుగా ఫిట్‌నెస్ ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


కార్యక్రమంలో ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు

సమస్యల పరిష్కారానికే ప్రజా ఫిర్యాదుల వేదిక: ఎమ్మెల్యే రాజు

రోలుగుంట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికే ప్రతీ సోమవారం ప్రజా ఫిర్యాదుల కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన అర్జీలను ఆయన స్వీకరించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. రెవెన్యూ శాఖకు తొమ్మిది అర్జీలు, బోర్లు ఏర్పాటు చేయాలని మూడు, వెలంకాయలపాలెం వెలుగు సీసీని మార్చాలని ఒకటి, ఇతర సమస్యలపై ఐదు దరఖాస్తులు వచ్చినట్టు ఎంపీడీవో నాగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రావికమతంలో ప్రజా ఫిర్యాదుల కార్యక్రమం

రావికమతం: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల కార్యక్రమం నిర్వహించారు. వివిధ సమస్యలపై వచ్చిన 40 ఫిర్యాదులను ఎమ్మెల్యే రాజు స్వీకరించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల ప్రజల సమస్యలపై ప్రతీ నెల ఒక రోజు ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తానని ఎమ్మెల్యే చెప్పారు. అనంతరం తెలుగునాడు వైద్య, ఆరోగ్య ఉద్యోగుల సంఘం 2025 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకన్నబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు రాజాన కొండనాయుడు, ఉప సర్పంచ్ గంజి మోదునాయుడు, నాయకులు కోట గోవిందరావు, బంటు శ్రీను, వి.వెంకటాచారి, గల్లా నాని, వైద్య, ఆరోగ్య సంఘాల జిల్లా అధ్యక్షుడు పి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

మేడిచర్లలో వంద మంది టీడీపీలో చేరిక


టీడీపీలో చేరిన బొడ్డు వెంకటరమణ సత్కరిస్తున్న ఎమ్మెల్యే బండారు

కె.కోటపాడు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడిచర్ల గ్రామంలో మాజీ ఎమ్మెల్యే దివంగత పూడి మంగపతిరావు తనయుడు నారాయణమూర్తి ఆధ్వర్యంలో సోమవారం వంద మంది టీడీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి స్వాగతం పలికి పార్టీ కండువాలు కప్పి సత్కరించారు. అలాగే రక్తదాన శిబిరంలో 30 మంది యువకులు రక్తదానం చేశారు. 18 సార్లు రక్తదానం చేసిన తాడి మనోహర్‌ను ఎమ్మెల్యే బండారు సత్కరించారు. అనంతరం రైవాడ రిజర్వాయర్ మాజీ చైర్మన్ బొడ్డు వెంకటరమణ వంద మంది గ్రామస్థులతో టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రొంగలి మహేశ్, బీజేపీ మండల అధ్యక్షుడు పైలా అమ్మాజీ, నాయకులు పూడి శ్రీను, బత్తి వెంకటరమణ, ఎస్.రామునాయుడు, డి.నరసింహమూర్తి, బి.అక్కునాయుడు, కె.సూర్యనారాయణ, ఐ.బ్రహ్మాజీ, బి.అప్పలరాజు, ఉగ్గిన త్రినాథ్ పాల్గొన్నారు.

మంత్రి నాదెండ్లను కలిసిన జనసేన ఇన్‌చార్జి రాజు



చోడవరం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రధానమంత్రి మోదీ విశాఖ పర్యటన నిమిత్తం సోమవారం విశాఖ వచ్చిన నాదెండ్లను విశాఖ ఎయిర్‌పోర్టులో కలిసి సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గోవాడ చెరకు రైతులు, నియోజకవర్గంలోని ప్రజల సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు.

వితంతు పింఛన్ల కోసం ఆందోళన


ఎంపీడీవో కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న వితంతువులు

చీడికాడ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కుటుంబ యజమానులను కోల్పోయి దిక్కుతోచని స్థితిలో ఉన్న తమకు వెంటనే పింఛన్ మంజూరు చేయాలని వితంతువులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. భర్త మృతి చెందిన 15 రోజులకే భార్యలకు పింఛన్‌లు మంజూరు చేస్తామన్న ప్రభుత్వ హామీ తమకు అమలు కాలేదని వాపోయారు. ప్రభుత్వం పింఛన్‌లు మంజూరు చేసి తమను ఆదుకోవాలని కోరారు. అనంతరం ఎంపీడీవో హేమసుందర్రావుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ ఎస్.శ్రీనివాసరావు, వైసీపీ నాయకులు చుక్క అప్పలనాయుడు, పి.మహేశ్, పి.రామారావు, జి.స్వామినాయుడు, ఎస్.రమణబాబు, కోఆప్షన్ సభ్యుడు షేక్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


పూర్వ విద్యార్థులతో కలిసి ఉన్న ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవి

చోడవరం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో 1991-94 సంవత్సరం బ్యాచ్ విద్యార్థులు 33 ఏళ్ల తరువాత ఆదివారం కలిశారు. మండలంలోని అడ్డూరు గ్రామం వీరి కలయికకు వేదిక అయింది. రాష్ట్ర ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవి ఈ బ్యాచ్ విద్యార్థి కావడం విశేషం. మూడు దశాబ్దాల తరువాత కలిసిన విద్యార్థులంతా చిన్ననాటి ముచ్చట్లతో కాలక్షేపం చేశారు. పూర్వ విద్యార్థుల బ్యాచ్‌లో ఉన్న ప్రభుత్వ విప్ చిరంజీవి తన చిన్ననాటి స్నేహితులతో కలిసి చిన్ననాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో రమాకాంత్, బాబ్జి, భూషణం, నాగేశ్వరరావు, నాయుడుబాబు, గౌరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఏఎల్‌పురం దుకాణదారులకు నోటీసులు

కృష్ణాదేవిపేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఏఎల్‌పురం వారపు సంతలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పాలకులు, పోలీసులు, పంచాయతీ అధికారులు సంయుక్తంగా దుకాణాదారులకు నోటీసులు అందించారు. సంతలో వ్యాపారులకు సరైన సౌకర్యం లేదు. దీంతో రోడ్డుకిరువైపులా దుకాణాలు పెట్టడంతో ప్రతీ రోజు ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులతో కృష్ణాదేవిపేట ఎస్ఐ వై.తారకేశ్వరరావు, సర్పంచ్ లోచల సుజాత, ఈవోపీఆర్‌డీ కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో రోడ్డుపై వ్యాపారులకు నోటీసులు అందించారు. రోడ్డుపై దుకాణాలు పెట్టే వ్యాపారులు నిబంధనలు పాటించాలని సూచించారు.

రహదారి లేని రెల్లలపాలెం

- రాళ్లు, తుప్పల మధ్య గిరిజనులు రాకపోకలు
- నిత్యావసర సరకులు, అత్యవసర సేవలకు పాట్లు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు


రాళ్లు, తుప్పల మధ్య నడిచి వెళ్తున్న రెల్లలపాలెం గ్రామ గిరిజనులు

చీడికాడ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాం శివారు రెల్లలపాలెం గిరిజన గ్రామానికి రహదారి సదుపాయం లేక గిరిజనులు అష్టకష్టాలు ఎదుర్కొంటున్నారు. కోనాంకు పది కిలోమీటర్ల దూరాన కొండపై ఉన్న ఈ గ్రామంలో సుమారు 14 కుటుంబాల వారు నివాసం ఉంటున్నారు. వారికి ఏ అవసరమైనా కోనాం రావాల్సిందే. ఈ క్రమంలో రహదారి సదుపాయం లేక తుప్పలు, డొంకల మధ్య రాకపోకలు సాగించాల్సి వస్తున్నదని గిరిజనులు ఇరటా నరసింహమూర్తి, కోట గంగరాజు, కోట దేముడు, సోమల సూర్యనారాయణలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీ గురువారం నిత్యావసర సరకుల కొనుగోలుకు, పంటల ఉత్పత్తుల విక్రయాలకు కాలినడకన మోసుకుని వస్తున్నామని వారు వాపోయారు. అలాగే జ్వరం వచ్చినా, గర్భిణులు ఆస్పత్రులకు వెళ్లాలన్నా ఇబ్బందులు తప్పడం లేదని తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అలాగే గ్రామంలో బావినీటినే తాగునీటిగా వినియోగిస్తున్నామని, కొన్నిసార్లు రోగాల బారిన పడుతున్నామని వాపోయారు. ఎన్నికల్లో తమ గ్రామానికి రహదారి నిర్మాణంపై నాయకులు ఇచ్చిన హామీలను, తర్వాత మరచిపోతున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా గ్రామం నుంచి కోనాం వచ్చేందుకు వాలాబు వరకు రహదారి సదుపాయం కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు.

అందరికీ ఆమోదయోగ్యంగా ఉపాధ్యాయ బదిలీలు

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘువర్మ


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘువర్మ

చోడవరం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులందరికీ ఆమోదయోగ్యంగా బదిలీ నిబంధనలు రూపొందించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ సూచించారు. మండలంలోని పలు పాఠశాలలను సోమవారం సందర్శించి ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. జీవో 117 రద్దు చేసి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కేజీబీవీ ఉపాధ్యాయులకు ఎంటీఎం ఇవ్వాలని, మోడల్ స్కూల్స్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్.దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షుడు ఎం.మహలక్ష్మినాయుడు, మండల అధ్యక్ష, కార్యదర్శులు గొల్లు శ్రీనివాసరావు, మల్లేశ్వరరావు, జిల్లా కౌన్సెలర్లు డీవీవీ రమణ, పి.వరలక్ష్మి, బి.ఉషారాణి, కె.ధనలక్ష్మి, టీవీ.రమణ, నిశ్చలశర్మ, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

చీడికాడలో ఎమ్మెల్సీ పర్యటన

చీడికాడ: మండలంలోని మంచాల, తురువోలు, చుక్కపల్లి, చీడికాడ, ఖండివరం, వరహాపురం పాఠశాలలను ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పి.రఘువర్మ సోమవారం సందర్శించారు. ఉపాధ్యాయులను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటు తనకు వేయాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. ఆయనతో పాటు టీచర్స్ సంఘం జిల్లా, మండల నాయకులు ఆడారి రమేష్, జీపీఏ.నాయుడు, పివి.మూర్తి, ఆర్.గోవింద, లెక్కల ప్రసాద్, ఆర్.గణపతి, వై.వరహాలుబాబు, మల్లేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో గిరిజనుల నిరసన


సదస్సులో అధికారుల ముందు ఉరితాళ్లతో నిరసన తెలుపుతున్న గిరిజనులు

రావికమతం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): తమ భూములను రియల్ వ్యాపారులు దౌర్జన్యంగా దున్నేస్తున్నారంటూ, వాటిని ఇప్పించి తమకు రక్షణ కల్పించాలని కవ్వగుంట గ్రామ గిరిజనులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కవ్వగుంటలో సోమవారం జరిగిన రెవెన్యూ సదస్సులో వినూత్నంగా నిరసన తెలిపారు. కవ్వగుంట పరిధిలో 61/1, 61/2, 64/1, సర్వే నంబరులో ఉన్న 11.62 ఎకరాల గయాల భూమిని గ్రామానికి చెందిన రొబ్బా పోతురాజుదొర, వరహాలమ్మ, కిముడు మహాలక్ష్మి, రొబ్బా నాగరాజు తదితరులు 30 ఏళ్లుగా సాగుతో జీవనోపాధి పొందుతున్నారు. సాగులో ఉన్న గిరిజనులను కాదని స్థానికేతరుడైన రియల్ వ్యాపారస్థుడికి రీ సర్వేలో పట్టాలు ఇచ్చారని చెప్పారు. ఈ పట్టాలను రద్దు చేస్తామని రెవెన్యూ అధికారులు హామీ ఇచ్చిన అమలు కాకపోవడంతో శివరావు దౌర్జన్యంగా దున్నేస్తున్నారని, ఆయననుంచి తమకు రక్షణ కల్పించాలని కోరారు. అలాగే తమ భూములను తమకు అప్పగించాలంటూ గిరిజనులు తెలిపారు. న్యాయం చేయకుంటే ఉరే గతని గిరిజనులు వాపోయారు. ఈ కార్యక్రమం సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు చెప్పారు. వీటిపై అధికారులు విచారణ చేసి భూములు కోల్పోయిన గిరిజనులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రొబ్బా శంకరావు, సొందొర పాల్గొన్నారు.

పాడి రైతులకు విశాఖ డెయిరీ బోనస్ పంపిణీ

కె.కోటపాడు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌడువాడలో పాడి రైతులకు విశాఖ డెయిరీ సోమవారం సంక్రాంతి బోనస్‌ను అందించింది. డెయిరీ డైరెక్టర్ ఎస్.గంగాధర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ పాడి పశువులతో పాటు కోళ్ల, గొర్రెలు అధికంగా పెంచేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. సీఎం చంద్రబాబు పశు పెంపకం యూనిట్లపై దృష్టిసారిస్తున్నారన్నారు. విశాఖ డెయిరీ వైస్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి మాట్లాడుతూ గేదెల కొనుగోలు, దాణా పరికరాల కోసం పాడి రైతులకు డెయిరీ సహకారం ఉంటుందన్నారు. అనంతరం కె.కోటపాడు, దేవరాపల్లి, వేపాడ, ఎల్.కోట, కొత్తవలస మండలాల రైతులకు సంక్రాంతి బోనస్‌గా రూ.5.62 కోట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డెయిరీ డైరెక్టర్లు ఎస్.సూర్యనారాయణ, కోళ్ల కాటమయ్య, దాడి పవన్‌కుమార్, గేదెల సత్యనారాయణ, శంకర్రావు, డెయిరీ మేనేజర్ పాండ్యరాజన్, సర్పంచ్ దాడి ఎరుకునాయుడు తదితరులు పాల్గొన్నారు.

మాకవరపాలెంలో...

మాకవరపాలెం: మండలంలోని ఎరకన్నపాలెం గ్రామంలో విశాఖ డెయిరీ పాడి రైతులకు రూ.2.21 లక్షల నగదును సంక్రాంతి బోనస్‌గా పంపిణీ చేశారు. రైతులకు సంక్రాంతి సమయంలో బోనస్‌లు ఇవ్వడం డెయిరీ లక్ష్యమని డెయిరీ మేనేజర్ శంకరరావు, సంఘం అధ్యక్షుడు కొండబాతెలిపారు.

చౌడువాడలో పశువుల పాక దగ్ధం

కె.కోటపాడు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌడువాడ గ్రామంలో ఆదివారం రాత్రి తలారి వెంకయమ్మ పశువుల పాకకు నిప్పంటుకుంది. ఈ ప్రమాదంలో పాక పూర్తిగా దగ్ధమైంది. అలాగే ఒక ఆవు మృతి చెందింది. మరో ఆవు తీవ్రంగా గాయపడింది. సుమారు రూ.లక్ష మేర ఆస్తి నష్టం వాటిల్లిందని అంచనా. ప్రమాదం గురించి తెలుసుకున్నా మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, డెయిరీ డైరెక్టర్లు పిళ్లా రమాకుమారి, సుందరపు గంగాధర్, సర్పంచ్ దాడి ఎరుకునాయుడు తదితరులు ఆర్థిక సాయంగా రూ.10 వేలు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు రొంగలి మహేశ్, క్లస్టర్ ఇన్‌చార్జి కన్నూరు సూర్యనారాయణ, టీడీపీ నాయకుడు కొట్యాడ నారాయణమూర్తి, జనసేన మండల నాయకుడు కుంచా అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సు రద్దు చేయాలని ధర్నా

నాతవరం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంంలోని చమ్మచింత గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అధికారుల ఎదుట రైతులు ఆందోళనకు దిగారు. రైతులు శివలంక సత్యనారాయణ, చిక్కాల సత్తిబాబు తదితరులు తమ సమస్యలు పరిష్కరించకుండా సదస్సులు నిర్వహించడం సరికాదన్నారు. 2018 తర్వాత చమ్మచింత రైతులకు పాసుపుస్తకాలు ఉన్నప్పటికీ ఆన్‌లైన్‌లో లేవని, ఫలితంగా రైతుభరోసా అందడం లేదని వాపోయారు. సమస్యలను పరిష్కరించాలని ఎన్నోమార్లు అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయిందని, రైతు సమస్యలు పరిష్కరించని సదస్సు ఎందుకని ఆయన ప్రశ్నించారు. టీడీపీ నాయకులు కాశపు నూకరాజు సత్యనారాయణ, విజయ్ రైతులు ఆందోళన విరమించి సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో డీటీ వి.శివ, గోవిందరావు, సర్పంచ్ వి.కొండబాబు, ఉప సర్పంచ్ ఎ.దివాణం, వీఆర్వో రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


సదస్సు రద్దు చేయాలని నినాదాలు చేస్తున్న రైతులు

అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు

- డీఎఫ్‌వో ఎం.శామ్యూల్


టేకు కలప వేలం పాటలో పాల్గొన్న డీఎఫ్‌వో శామ్యూల్

గొలుగొండ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అటవీ ప్రాంతంలో అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్టు డీఎఫ్‌వో ఎం.శామ్యూల్ తెలిపారు. మండల కేంద్రంలోని టేకు డిపోలో సోమవారం టేకు కలప వేలంపాట నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ టేకు కలప ద్వారా ప్రభుత్వానికి ఆదాయం చేకూరుతుందన్నారు. అటవీ భూముల్లో గతంలో ఏర్పాటు చేసిన టేకు కలపను డిపోల ద్వారా వేలం వేస్తామన్నారు. అనకాపల్లి జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో ఎండిన ఆకులకు ముందస్తుగా నిప్పంటించి చెట్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టేందుకుగాను ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. వేసవిలో అటవీ ప్రాంతాన్ని కాపాడేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించామన్నారు. ఈ ఏడాది సీజన్‌లో ఐదు లక్షల వివిధ రకాలైన మొక్కలు నాటేందుకుగాను ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ప్రభుత్వానికి నిధులు మంజూరుకు ప్రతిపాదనలు పంపామన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణాదేవిపేట రేంజర్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అదానీ దిష్టిబొమ్మ దహనం


పవర్ ప్లాంట్‌ను వ్యతిరేకిస్తూ అదానీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న గిరిజనులు

దేవరాపల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నగరంపాలెం, చింతలపూడి ప్రాంతాల్లో అదానీ కంపెనీకి చెందిన హైడ్రో పవర్ ప్లాంటు అనుమతులు రద్దు చేస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 8న విశాఖలో జరిగే సభలో ప్రకటన చేయాలంటూ గిరిజనులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం అదానీ దిష్టిబొమ్మను దహనం చేశారు. అంతేకాకుండా అడ్డాకులతో టోపీలు పెట్టుకుని విల్లంబులతో నిరసన తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న మాట్లాడుతూ ఈ ప్రాంతంలో గిరిజనుల జీవనానికి, ఆయకట్టుకు నీరందించే జీవనదులకు ముప్పు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు బుచ్చిబాబు, బీటీ.దొర, ఎం.రవికుమార్ పాల్గొన్నారు.

1200 లీటర్ల బెల్లం పులుసు ధ్వంసం

కె.కోటపాడు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొరువాడ, గవరపాలెం గ్రామాల్లో సోమవారం అనకాపల్లి, విజయనగరం జిల్లాల ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 1200 లీటర్ల బెల్లం సేలేపే ధ్వంసం చేశారు. కొరువాడ గ్రామంలో 800 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేసి 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. అలాగే గవరపాలెం పొలిమేరలో 400 లీటర్ల బెల్లం పులుసును ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో చోడవరం ఎక్సైజ్ సీఐ కేవీపీ నాయుడు, అనకాపల్లి ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ చెందిన ఎస్.శ్రీనివాసరావు, విజయనగరం ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ రాజశేఖర్‌నాయుడు, కొత్తవలస ఎక్సైజ్ సీఐ కుమార్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

మునిసిపాలిటీలో సర్వీస్ ప్రొవైడర్ల కోసం దరఖాస్తు చేసుకోండి

నర్సీపట్నం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలో సర్వీస్ ప్రొవైడర్ల నియామకానికి చేతి వృత్తి పని వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కమిషనర్ సురేంద్ర తెలిపారు. చేతి వృత్తుల మీద ఆధారపడి జీవిస్తున్నవారికి మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడానికి, వారి సేవలు ఆన్‌లైన్‌లో ఉంచి నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంచడానికి సర్వీసు ప్రొవైడర్లను నియమిస్తున్నామని చెప్పారు. ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్లు, ఫ్రిజ్, ఏసీ, గ్రీజర్లు, వాషింగ్ మిషన్లు తదితర గృహోపకరణాలు మరమ్మతులు చేసే మెకానిక్‌లు, బ్యూటీషియన్ సేవలు అందించడానికి ఆసక్తి ఉన్నవారి నుంచి దరఖాస్తులు కోరుతున్నామని తెలిపారు. పెద బొడ్డేపల్లి కూరగాయల మార్కెట్ పక్కన ఉన్న మెప్మా కార్యాలయంలో దరఖాస్తు ఫారాలు అందజేస్తామని తెలిపారు. దరఖాస్తులు నింపి ఈ నెల 10వ తేదీ లోగా మెప్మా ఆఫీసులో అందజేయాలని సూచించారు. ఆధార్, పాన్ కార్డు, బ్యాంకు ఖాతా నంబరు, విద్యార్హతకు సంబంధించి జెరాక్స్ కాపీలు, రెండు పాస్ పోర్టు ఫొటోలు దరఖాస్తుకు జత చేయాలని తెలిపారు.

నేడు మోదీ పర్యటనపై సమావేశం

చోడవరం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ విశాఖపట్నం పర్యటన సందర్భంగా పట్టణంలోని వినాయకుడి గుడి వద్ద మంగళవారం కూటమి కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్టు టీడీపీ మండల అధ్యక్షుడు బొడ్డేడ గంగాధర్ సోమవారం తెలిపారు. ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ సమావేశానికి మండలానికి చెందిన కూటమి నేతలు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కూటమి ప్రభుత్వ హయాంలోనే గ్రామాల అభివృద్ధి

గొలుగొండ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని గొలుగొండ సర్పంచ్ కసిపల్లి చినప్పారావు అన్నారు. గొలుగొండ గ్రామ సచివాలయం వద్ద సోమవారం గ్రామ అభివృద్ధి ప్రణాళికపై గ్రామసభ నిర్వహించారు. కొత్తజోగంపేటలో శ్మశాన వాటిక, పేటమాలపల్లి గ్రామాల్లో బోరు, శ్రీరాంపురం గ్రామంలో డ్రైనేజీ ఏర్పాటు చేయాలని వార్డు మెంబర్ రాయపురెడ్డి వాసు కోరారు. సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం హర్షణీయమని ఈ సందర్భంగా సర్పంచ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సంఘం రాష్ట్ర డైరెక్టర్ పల్లేటికుర్తి రమేశ్, స్థానిక నేత గండేపల్లి రాము పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యల షరిష్కారం

కృష్ణాదేవిపేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలు పరిష్కారమవుతాయని రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ కొండబాబు చెప్పారు. మేజర్ పంచాయతీ ఏఎల్‌పురంలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి వచ్చిన సుమారు 40 వినతులను స్వీకరించారు. అనంతరం డీటీ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ కె.శ్రీనివాస్, ఆర్ఐ నాగరాజు, సర్వేయర్ సత్యనారాయణ, వీఆర్‌వో రాజు, సర్పంచ్ లోచల సుజాత, ఎంపీటీసీ సభ్యుడు చింతల బుల్లి ప్రసాద్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు చిటికెల తారకవేణుగోపాల్, కూటమి నేతలు బిజమీలు, చిట్టిబాబు, ఎల్.రాజులునాయుడు పాల్గొన్నారు.

దళిత వాడల్లో అభివృద్ధి పనులకు పాలకులు కృషిచేయాలి

గొలుగొండ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): దళిత వాడల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు పాలకులు కృషి చేయాలని టీడీపీ ఎస్సీ సెల్ పార్లమెంట్ నియోజకవర్గ కార్యదర్శి కొల్లాబత్తిన శివ కోరారు. గొలుగొండ మామిడితోటలో సోమవారం దళితులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళిత వాడల్లో అభివృద్ధి పనులకు కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నదన్నారు. అయితే ఈ నిధులను దళితులకు కాకుండా ఇతరులకు కేటాయించడం సరికాదన్నారు. దీనిపై పాలకులు ప్రత్యేక దృష్టిసారించాలని కోరారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు సరమండ సూరిబాబు, చిట్ల సింహాచలం, తమ్మిల అప్పారావు, కూలి గడ్డియ్య, దార పాల్గొన్నారు.

నేడు పశు వైద్య శిబిరం

కృష్ణాదేవిపేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని గుండుపాల గ్రామంలో మంగళవారం పశు వైద్య శిబిరం నిర్వహిస్తామని కృష్ణాదేవిపేట పశు వైద్యాధికారి శిరీషా తెలిపారు. సోమవారం విలేకర్లతో ఆమె మాట్లాడుతూ ఈ శిబిరంలో గర్భకోశ వ్యాధులకు ఉచితంగా చికిత్సలు చేస్తామని చెప్పారు. నర్సీపట్నం ప్రాంతీయ పశు వైద్య సంచాలకులు డాక్టర్ రాంబాబు, గొలుగొండ, పాములవాక, ఇతర మండలాల పశు వైద్యాధికారులు శిబిరంలో పాల్గొంటారన్నారు. ఈ అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ప్రజా ఉద్యమాలకు సహకరించాలి

కృష్ణాదేవిపేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఉద్యమాలకు అందరూ సహకరించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రాము కోరారు. ఏఎల్‌పురం వారపు సంతలో సోమవారం విరాళ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ ఎప్పుడూ పోరాడుతున్నదని చెప్పారు. తమకు ప్రజలు కూడా అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు మేకా సత్యనారాయణ, జి.రాధాకృష్ణ, మేకా భాస్కరరావు పాల్గొన్నారు.

మోదకొండమ్మకు వెండి వితరణ

మాడుగుల రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.కోడూరులో మోదకొండమ్మకు పావు కిలో వెండిని సోమవారం భక్తులు వితరణగా అందించారు. గ్రామానికి చెందిన సాకా సత్యనారాయణ కుటుంబీకుల సహకారంతో సర్పంచ్ ,ఆలయ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి సంజీవరావుకు వెండిని అందించారు.

ప్రధాని మోదీ పర్యటన జయప్రదం చేయాలి

నర్సీపట్నం అర్బన్: విశాఖలో ఈ నెల 8న జరగనున్న ప్రధాని మోదీ పర్యటనను విజయవంతం చేయాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వీరసూర్యచంద్ర కోరారు. సోమవారం సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 8న వివిధ పరిశ్రమలకు శంకుస్థాపన చేస్తామన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు రేగుబళ్ల శివ, వి.వెంకటరమణ, డాక్టర్ నారాయణరావు, నమ్మి రమణరాజు, పి.నాగు, బి.చిరంజీవి, రమణ, ప్రసాద్, రాజు, కె.సురేశ్, రమణ పాల్గొన్నారు.



కొత్తపొయిపల్లిలో పెసా కమిటీ ఎన్నికలను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం

» జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్

పెదబయలు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కొత్తపొయిపల్లి గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని అల్లూరి జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ తెలిపారు. పెదకోడపల్లి పంచాయతీ పరిధిలోని కొత్త పొయిపల్లి గ్రామంలో సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా గ్రామంలో తాగునీటి సమస్య వేధిస్తున్నదని, జలజీవన్ మిషన్ కింద బోరు మంజూరైనా కనెక్షన్ ఇవ్వకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్థులు తెలిపారు. దీనికి కలెక్టర్ స్పందిస్తూ గ్రామంలో ఊట నీటిని స్టోర్ చేసి పంపింగ్ ద్వారా సరఫరా చేయాలని, మిగిలిన నీటిని సాగుకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశించారు. అనంతరం పాఠశాలను సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థులతో ముచ్చటించి వారి సామర్థ్యాలను పరిశీలించారు. పలు ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టి సంతృప్తి చెందారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. నూతనంగా నిర్మిస్తున్న పాఠశాల భవనాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. అలాగే పెసా కమిటీ ఎన్నికలను పరిశీలించి పారదర్శకంగా జరపాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పూర్ణయ్య, పెసా కమిటీ ఎన్నికల ప్రత్యేక అధికారి రాజా రవికుమార్, సర్పంచ్ చిట్టిబాబు పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలన అందరి బాధ్యత



మాట్లాడుతున్న కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్, పక్కన ఈగల్ టీమ్ ఐజీ ఆకే రవికృష్ణ, తదితరులు



సమావేశంలో పాల్గొన్న వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు

» కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్

పాడేరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గంజాయి నిర్మూలన అందరి బాధ్యత అని కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ అన్నారు. ఈగల్ టీమ్ ఐజీ ఆకే రవికృష్ణతో కలిసి సోమవారం రాత్రి కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గంజాయిని పూర్తిగా నిర్మూలించేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో కృషి చేయాలన్నారు. గంజాయి సాగుకు దూరమైన రైతులను ప్రత్యామ్నాయ పంటలతో ప్రోత్సహిస్తామని, యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ప్రజలు గంజాయికి దూరం కావాలని కలెక్టర్ కోరారు. ప్రతి ఒక్కరూ తమ సామాజిక బాధ్యతగా గంజాయి నిర్మూలనకు కృషి చేయాలని, క్షేత్ర స్థాయిలో ఉండే వీఆర్వోలు, గ్రామ సచివాలయ సిబ్బంది గంజాయిపై నిఘా పెట్టాలన్నారు. గంజాయి సాగు, రవాణా పట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తే జిల్లాకు చెడ్డపేరు వస్తుందని కలెక్టర్ తెలిపారు. ఈగల్ టీమ్ ఐజీ ఆకే రవికృష్ణ మాట్లాడుతూ గంజాయి సాగు, రవాణాకు పాల్పడుతున్న వారిపై చట్టపరంగా చర్యలు చేపడతామన్నారు. సోమవారం పెదబయలు మండలంలోని మారుమూల ప్రాంతంలో 8 ఎకరాల్లో గంజాయి తోటలను డ్రోన్‌తో గుర్తించి ధ్వంసం చేశామన్నారు.

గంజాయిని శాశ్వతంగా నిర్మూలించేందుకు చర్యలు చేపడతామన్నారు. ఇటీవల అమరావతిలో జరిగిన కలెక్టర్ల సమావేశంలో గంజాయి గురించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేకంగా ప్రస్తావించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. గంజాయిని నిర్మూలించేందుకు అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. 2025లో గంజాయి మొక్కను నాటేందుకు అవకాశం లేకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ అమిత్‌బర్దార్, ఈగల్ ఎస్పీ నగేశ్‌బాబు, జిల్లా ఉద్యానవనాధికారి రమేశ్‌కుమార్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్ నంద్, జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు, డ్వామా పీడీ విద్యాసాగర్, జిల్లా పంచాయతీ అధికారి బి.లవరాజు, టీడబ్ల్యూ డీడీ ఎల్.రజని, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గర్భిణులకు హెచ్‌ఐవీ, హెపటైటీస్ పరీక్షలు

» కేంద్ర బృందం రీజనల్ అధికారి డాక్టర్ జేపీ ప్రీతం

చింతపల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ ఆస్పత్రుల్లో గర్భిణులకు విధిగా హెచ్‌ఐవీ, హెపటైటీస్ పరీక్షలు నిర్వహించాలని కేంద్ర బృందం భువనేశ్వర్ రీజనల్ అధికారి డాక్టర్ జేపీ ప్రీతం అన్నారు. మంగళవారం చింతపల్లి ఏరియా ఆస్పత్రిని కేంద్ర బృందం సందర్శించింది. ఏరియా ఆస్పత్రిలో గర్భిణులకు నిర్వహిస్తున్న హెచ్‌ఐవీ, హెపటైటీస్ పరీక్షల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈసందర్భంగా వైద్య సిబ్బందితో డాక్టర్ జేపీ ప్రీతం మాట్లాడుతూ గర్భిణిగా నిర్ధారణ జరిగిన వెంటనే హెచ్‌ఐవీ, హెపటైటీస్ పరీక్షలు నిర్వహించాలన్నారు. ఈవ్యాధులు ఉన్నట్టు నిర్ధారణ జరిగితే తల్లి నుంచి బిడ్డకు వ్యాధులు సంక్రమించకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఇందిరా ప్రియాంక, ఐటీడీసీ కౌన్సెలర్ మధుబాబు పాల్గొన్నారు.



ఆస్పత్రిని సందర్శించిన కేంద్ర బృందం

వైద్య సిబ్బందికి రూ.10 లక్షల ఆరోగ్యశ్రీ ప్రోత్సాహకాలు

» జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ వెల్లడి

» జిల్లాలో ప్రోత్సాహకాలు అందించడం ఇదే తొలిసారి

పాడేరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వైద్యులు, సిబ్బందికి ఆరోగ్యశ్రీలో వైద్య సేవలు అందించినందుకుగానూ రూ.10 లక్షలు ప్రోత్సాహంగా మంజూరైందని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ తెలిపారు. ఆయా ప్రోత్సాహకాలకు సంబంధించిన ధ్రువపత్రాన్ని సోమవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వామిత్రకు అందించారు. ఈసందర్భంగా కలెక్టర్ దినేశ్‌కుమార్ మాట్లాడుతూ... జిల్లాలో ఆరోగ్యశ్రీ సేవలు అందించినందుకు వైద్యులు, సిబ్బందికి ప్రోత్సాహకాలు అందించడం ఇదే తొలిసారన్నారు. ఇటువంటి ప్రోత్సాహకాల వల్ల వైద్యులు, సిబ్బంది మరింత ఉత్సాహం సేవలందిస్తారన్నారు. ఇందుకు కృషి చేసిన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వామిత్రను కలెక్టర్ అభినందించారు. ఇదే స్ఫూర్తితో రోగులకు చక్కని వైద్యసేవలందించి వైద్యులు, సిబ్బంది ప్రోత్సాహకాలు పొందాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.



ఆస్పత్రి సూపరింటెండెంట్ విశ్వామిత్రకు ఉత్తర్వులను అందిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

నూతన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు

ఉద్యాన పరిశోధన స్థానం అధిపతి చెట్టి బిందు

చింతపల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నూతన యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఉద్యాన పంటల్లో అధిక దిగుబడులు సాధించవచ్చునని స్థానిక ఉద్యాన పరిశోధన స్థానం అధిపతి, శాస్త్రవేత్త చెట్టి బిందు తెలిపారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో సేంద్రియ వ్యవసాయంపై శిక్షణ పొందుతున్న విద్యార్థులకు సోమవారం ఉద్యాన పరిశోధన స్థానంలో మిరియాలు, పసుపు, అల్లం సాగుపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన ప్రాంతం అరుదైన ఉద్యాన పంటల సాగుకు అత్యంత అనుకూలమన్నారు. పసుపు, అల్లం పంటలను బెడ్స్ రూపంలో నాట్లు వేసుకోవడం వల్ల దుంపకుళ్లు, ఇతర తెగుళ్లను నివారించవచ్చునన్నారు. అలాగే దిగుబడి పెరుగుతుందన్నారు. గిరిజన రైతులు ఉద్యాన పంటలను వాణిజ్య సరళిలో సాగు చేసుకోవడంతో అధిక ఆదాయం పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో జీకేఎంఎస్ ప్రాజెక్టు రీసెర్చ్ అసోసియేట్ డాక్టర్ టి. సునీల్ కుమార్, ఆర్ఏఆర్ఎస్ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ బాల హంస్సేన్‌రెడ్డి పాల్గొన్నారు.



మిరియాల సాగుపై అవగాహన కల్పిస్తున్న బిందు

ఎమ్మెల్సీ రఘువర్మను మళ్లీ గెలిపించాలి

ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకటపతిరాజు

చింతపల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్యే అభ్యర్థి పాకలపాటి రఘువర్మ విజయానికి ఉపాధ్యాయులు కృషిచేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకటపతిరాజు అన్నారు. సోమవారం మండలంలో పలు ఆశ్రమ, జిల్లా పరిషత్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను సందర్శించిన ఏపీటీఎఫ్ నాయకులు ఎమ్మెల్సీ అభ్యర్థి తరుపున ప్రచారం చేశారు. ఈసందర్భంగా వెంకటపతిరాజు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను శాసనమండలిలో ప్రస్తావించి ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లిన రఘువర్మను మరోసారి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి మురళి, జిల్లా ఉపాధ్యక్షులు దేపూరి శశికుమార్, జోనల్ కార్యదర్శిలు బొడు గంగరాజు, సత్యనారాయణ, చిట్టినాయుడు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకటపతిరాజు

పనిచేయని యూనియన్ బ్యాంకు సర్వర్

» నిలిచిన లావాదేవీలు.. » నిరాశతో వెనుదిరిగిన ఖాతాదారులు

చింతపల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో సోమవారం సర్వర్ పనిచేయలేదు. దీంతో లావాదేవీలు నిలిచిపోయాయి. బ్యాంక్ సేవల కోసం సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. బ్యాంక్‌లో ఉదయం ఆన్‌లైన్ సర్వర్‌లో సాంకేతిక సమస్య తలెత్తింది. టెక్నికల్ సిబ్బంది మరమ్మతులు చేసేందుకు చర్యలు ప్రారంభించారు. అయితే సాయంత్రం వరకు బ్యాంక్ సేవలు అందుబాటులోకి రాకపోవడంతో తీవ్ర నిరాశతో ఖాతాదారులు వెనుదిరిగారు.



బ్యాంక్ బయట నిరీక్షిస్తున్న ఖాతాదారులు

జాబ్‌మేళాలో 262 మందికి ఉద్యోగాలు : ప్రిన్సిపాల్

చింతపల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 262 మంది యువతీ, యువకులకు ఉద్యోగాలు లభించాయని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. విజయ భారతి తెలిపారు. సోమవారం కళాశాల ఆవరణలో చెన్నైకి చెందిన ఫోక్సాన్, టాటా ఎలక్ట్రానిక్స్, జీకే, మదర్ సన్, సుమీ కంపెనీలు జాబ్‌మేళాలో నిరుద్యోగ యువతకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించిందన్నారు. విద్యార్హత, మౌలిక ఇంటర్వ్యూల ద్వారా అర్హులైన విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించాయన్నారు. అలాగే మంగళవారం కూడా కళాశాలలో జాబ్ మేళా కొనసాగిస్తామని, పది, ఇంటర్, డిగ్రీ, పీజీ, డిప్లొమా, ఐటీఐ, ఇంజనీరింగ్ చదివిన విద్యార్థులు ఇంటర్వ్యూలకు నేరుగా హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో వివిధ కంపెనీల డైరెక్టర్లు ఎం. గంగరాజు, టి. సుధాకర్, ధనుంజయ్, వీవీఏ రాజు, శ్యాంకుమార్, కళాశాల అధ్యాపకులు డాక్టర్ శ్రీనివాస్ పాత్రుడు, డాక్టర్ రమణ, కె.సంతోషి, కె.లీలాపావని, డాక్టర్ కేజియా, రవీంద్రనాయక్, జగదీశ్‌బాబు, టి. జగత్‌రాయి పాల్గొన్నారు.



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న కంపెనీ ప్రతినిధులు, ప్రిన్సిపాల్ డాక్టర్ విజయభారతి

ఈశ్వరి గెలుపును ఆమోదించాలని ధర్నా



ధర్నాలో నినాదాలు చేస్తున్న కార్యదర్శి అభ్యర్థి ఈశ్వరి, గిరిజనులు, గిరిజన సంఘం నాయకులు

ముంచంగిపుట్టు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కించాయిపుట్టు పంచాయతీ కేంద్రంలో సోమవారం జరిగిన పెసా ఎన్నికల్లో పోటీదారుల్లో అత్యధిక ఓట్లు వచ్చిన సోనియా ఈశ్వరిని పెసా కార్యదర్శిగా ఎన్నికల అధికారులు ప్రకటించాలని అభ్యర్థిని ఈశ్వరితో కలిసి గిరిజన సంఘం నాయకులు, గిరిజనులు ఆందోళన బాట పట్టారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఎం.శ్రీను, కె.త్రినాథ్ మాట్లాడుతూ పెసా కమిటీ కార్యదర్శి పదవికి సంబంధించి ముగ్గురు సభ్యులు నామినేషన్ వేయడం జరిగిందని, వారిలో సోనియా ఈశ్వరికి 83 అత్యధిక ఓట్లు రాగా, మరో వ్యక్తికి 61 ఓట్లు, ఇంకో వ్యక్తికి ఎన్ని ఓట్లు వచ్చాయే లెక్కించకుండా ఎన్నికల అధికారులు, ఎంపీడీవోలు కార్యదర్శి ఎన్నిక వాయిదా వేస్తున్నట్టు ప్రకటించడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం ఎవరికి ఎక్కువ ఓట్లు వస్తే వారినే విజేతలుగా ప్రకటించాల్సి ఉండగా, ఇక్కడ ఎన్నికలు నిర్వహించిన అధికారులు పొంతన లేని సమాధానం చెబుతున్నారని ధ్వజమెత్తారు. మొదటి స్థానంలో అత్యధిక ఓట్లు వచ్చిన ఈశ్వరిని పెసా కార్యదర్శిగా ప్రకటించాలని, లేకుంటే పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి ఫిర్యాదు చేస్తామని వారు తెలిపారు.

ఈ విషయంపై ఎంపీడీవోను విలేకరులు వివరణ కోరగా, కించాయిపుట్టులో పెసా ఎన్నికలకు సంబంధించి ఉపాధ్యక్షుల ఎన్నిక ప్రక్రియ జయప్రదంగా పూర్తయిందని, ఎన్నిక వాయిదా వేయడం జరిగిందని చెప్పారు. కార్యదర్శి ఎన్నికకు సంబంధించి ఇరుపక్షాలు ఏకాభిప్రాయానికి రానందునే తాత్కాలిక వాయిదా వేశామన్నారు. మంగళవారం ఉదయం 10 గంటలకు కార్యదర్శి ఎన్నిక నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

గిరిజనులు నాటు వైద్యం జోలికి పోవద్దు

» జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి జమాల్ బాషా

» 'ఆంధ్రజ్యోతి' కథనంతో కదిలిన వైద్య శాఖ

అనంతగిరి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): గిరిజనులు నాటు వైద్యం జోలికి పోకూడదని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి జమాల్ బాషా సూచించారు. 'ఆగని శిశు మరణాలు' అనే శీర్షికతో డిసెంబరు 30న 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో వచ్చిన కథనంతో పాటుగా జడ్పీటీసీ సభ్యుడు దీసరి గంగరాజు ఉన్నతాధికారులకు ఫిర్యాదుపై ఆయన స్పందించారు. ఈ మేరకు మండలంలోని ఎగువశోభ పంచాయతీ పోర్నపోదోర్ గ్రామాన్ని సోమవారం వైద్య బృందంతో కలిసి ఆయన సందర్శించారు. శిశు మరణాలపై బాధితుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పలువురు చిన్నారులకు డీఎంహెచ్‌వో వైద్య పరీక్షలు నిర్వహించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వపు ఆచారాలతో చిన్నారుల కడుపుపై వాతలు పెట్టవద్దని, నాటు వైద్యంలో భాగంగా పసర మందులను వాడవద్దని చెప్పారు. దీనివల్ల చిన్నారులు ప్రాణాలకు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పోర్నపోదోర్ గ్రామంలోని శిశు మరణాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామని, గర్భిణులుగా ఉన్న సమయంలోని ముందస్తుగా పరీక్షలు చేయిస్తామని చెప్పారు. ఏఎన్ఎం, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల్లో పరిస్థితిపై వైద్యులకు సమాచారం అందించాలని సూచించారు ఈ కార్యక్రమంలో చిన్న పిల్లల వైద్యులు హరి, బాలాజీ, పీహెచ్‌సీ వైద్యులు జ్ఞానేశ్వరి, ఎంపీహెచ్‌వో నరసింగరావు, జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు, సర్పంచ్ సింహాద్రి పాల్గొన్నారు.



పోర్నపోదోర్‌లో గిరిజనులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

చట్టాలపై అవగాహన అవసరం: ఎంఈవో

ముంచంగిపుట్టు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, పోక్సో చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఎంతో అవసరమని మండల విద్యా శాఖాధికారి క్రిష్ణమూర్తి స్పష్టం చేశారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోరి వికాసం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్య, ఆరోగ్యం, రుతుక్రమ పరిశుభ్రత, విద్య, స్వీయ సంరక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే బాల బాలికలు ఆరోగ్యంగా జీవించేందుకు తీసుకోవాల్సిన ఆరోగ్య సూత్రాలను వైద్యులు తెలియజేశారు. పాఠశాలలు, వసతి గృహాలలో ఉన్న బాల బాలికలతో పాటు మధ్యలో చదవు మానేసి గ్రామాల్లో ఉన్న 11 నుంచి 18 ఏళ్ల లోపు బాలురు, బాలికలను వేర్వేరుగా కిశోరి సమూహాలుగా ఏర్పాటు చేయాలని సీడీపీవో సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, వైద్యులు, సచివాలయం మహిళా సంరక్షణ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

రెవెన్యూ రీ సర్వేపై అవగాహన ర్యాలీ

ముంచంగిపుట్టు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పనసపుట్టు పంచాయతీ పోతురాజుపుట్టు గ్రామంలో రెవెన్యూ రీ సర్వేపై సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఐ వెంగడ రవి మాట్లాడుతూ భూ రీ సర్వే కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మ్యుటేషన్‌లు, సరిహద్దు సమస్యలు, భూ తగాదాల పరిష్కారానికి సర్వే దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో సర్వేయర్, ఉద్యోగులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టును వణికిస్తున్న చలి

ముంచంగిపుట్టు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలాన్ని కొద్ది రోజులుగా చలిపులి వణికిస్తోంది. సోమవారం ఉదయం పది గంటల వరకు మంచు తెరలు వీడలేదు. మండల కేంద్రంలో పది డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. సాయంత్రం నాలుగు గంటల నుంచే చలి గజగజలాడిస్తోంది. దీంతో పిల్లలు, వృద్ధులు విలవిలలాడిపోతున్నారు. అలాగే ఎక్కువ శాతం మంది ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు.

అద్దరవీధిలో సాగు నీటి కాలువ మరమ్మతులకు నిధులు విడుదల



సాగునీటి కాలువను పరిశీలిస్తున్న డీఈఈ నాగేశ్వరరావు

గూడెంకొత్తవీధి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి):స్థానిక అద్దరవీధిలో సాగు నీటి కాలువ మరమ్మతులకు ప్రభుత్వం రూ.16.5 లక్షలను విడుదల చేసిందని పాడేరు ఎస్ఎంఐ డీఈఈ నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం స్థానిక ఎస్ఎంఐ ఏఈఈ లోకేశ్‌తో కలిసి అద్దరివీధిలో వర్షాలకు కొట్టుకుపోయిన పంట కాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈఈ మాట్లాడుతూ కాలువ కొట్టుకుపోవడంతో పొలాలకు సాగు నీరు అందడం లేదన్నారు. అలాగే 30 గ్రామాల ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. సంక్రాంతి పండగ అనంతరం కాలువ, సీసీ ర్యాంప్ నిర్మాణం పనులు ప్రారంభిస్తామన్నారు. ఈకార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు దావీద్ పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులు ఆన్‌లైన్ హాజరు వేయాలి

చింతపల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయం ఉద్యోగులు విధిగా ఆన్‌లైన్ హాజరు నమోదు చేసుకోవాలని స్థానిక ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ సమావేశమందిరంలో సచివాలయం ఉద్యోగులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ ప్రధానంగా సచివాలయం పరిధిలో ఈకేవైసీ, ఎన్‌పీసీఐ, హౌస్ హోల్డ్ సర్వేను వేగవంతం చేయాలన్నారు. ఏపీఈ సర్వీస్ నగదు వెంటనే జమచేయాలన్నారు. మిస్సింగ్ సిటిజన్, ఉద్యోగులను సర్వేలో చేర్చాలన్నారు. టీఎంఎఫ్ స్కూల్ శానిటేషన్, మరుగుదొడ్లు పరిశీలించాలన్నారు. ఉద్యోగులు విధుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రభుత్వ భూములను సంరక్షించాలని వినతి



రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గూడెంకొత్తవీధి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రభుత్వ భూములను సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందని జీకే వీధి సర్పంచ్ సుభద్ర అన్నారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రానికి చెందిన వివిధ పార్టీలు, సంఘాల నాయకులు రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మండల కేంద్రంలో ప్రభుత్వ భూములు కొంత మంది ఆక్రమణలో ఉన్నాయన్నారు. దీంతో ప్రభుత్వ భవనాలు నిర్మించేందుకు స్థలం లేకుండా పోయిందన్నారు. రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి ప్రభుత్వ భూముల వివరాలు పంచాయతీకి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు ఎ. బుజ్జిబాబు, నాయకులు అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

జెడ్పీ నిధులతో పలు అభివృద్ధి పనులు

» జెడ్పీటీసీ సభ్యురాలు శివరత్నం



డ్రైనేజీ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న శివరత్నం

గూడెంకొత్తవీధి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో జెడ్పీ నిధులతో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామని స్థానిక జెడ్పీటీసీ సభ్యురాలు శివరత్నం అన్నారు. సోమవారం సిరిబాలలో గ్రామంలో డ్రైనేజీ నిర్మాణానికి ఆమె భూమి పూజ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మండలంలో పలు గిరిజన గ్రామాల్లో జెడ్పీ నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తున్నామన్నారు. అలాగే తాగునీటి సమస్య అధికంగా ఉన్న గ్రామాల్లో బోర్‌వెల్స్ వేయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బోయిన కుమారి, వైస్ సర్పంచ్ శ్రీధర్, పేసా ఉపాధ్యక్షుడు కోటి పాల్గొన్నారు.

ఎఫ్ఎల్ఎన్ శిక్షణా ఫలితాలు విద్యార్థుల్లో కనిపించాలి

» విద్యా శాఖ ఆర్జేడీ విజయ్‌భాస్కర్



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న ఆర్జేడీ విజయ్‌భాస్కర్

అరకులోయ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎఫ్ఎల్ఎన్ శిక్షణ ఫలితాలు విద్యార్థులలో కనిపించాలని విద్యా శాఖ ఆర్జేడీ విజయ్ భాస్కర్ స్పష్టం చేశారు. మండల కేంద్రంలో ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. పునాది స్థాయిలో విద్యార్థులకు చక్కటి విద్యా బోధన అందించాలన్నారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు పనిచేసే పాఠశాలల్లోని విద్యార్థుల్లో ఈ ఫలితాలు కనిపించాలన్నారు. మెరుగైన ప్రమాణాలతో కూడిన విద్యా బోధన చేస్తే విద్యార్థులకు చక్కటి భవిష్యతుత అందించిన వారవుతామన్నారు. జిల్లా విద్యా శాఖాధికారి బ్రహ్మాజీ మాట్లాడుతూ బాల్య దశలోనే విద్యార్థులకు చక్కటి విద్యా ప్రమాణాలను అందించాలంటే ప్రతీ అంశంపైనా ఉపాధ్యాయులకు సంపూర్ణ అవగాహన ఉండాలన్నారు. ఇటువంటి శిక్షణా తరగతులు ఇందుకు ఎంతగానో దోహదపడతాయని ఆయన చెప్పారు. ఈ శిక్షణ తరగతుల్లో రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ టి.ఇస్మాయల్, మండల విద్యా శాఖాధికారి వి.త్రినాథరావు, భారతీరత్నం, జిల్లా కోఆర్డినేటర్ వి.వెంకన్న, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో దివ్యాంగ పింఛన్ల పరిశీలన

అనంతగిరి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో దివ్యాంగుల పింఛన్లను వైద్య బృందం సోమవారం పరిశీలించారు. పూర్తి స్థాయి వైకల్యం కలిగిన కొత్తూరుకు చెందిన గుడ్డేల గంగులు, అనంతగిరికి చెందిన కమిడి మల్లేశ్వరరావు, గున్నమ్మ, ఎగువ శోభకు చెందిన కోనేపు ప్రవీణ్‌ను క్షుణంగా పరిశీలించారు. పూర్తి స్థాయిలో వైకల్యం ఉందా? లేదా? అనేదానిపై కేజీహెచ్ నుంచి అసిస్టెంట్ ప్రొఫెసర్ డి.సింహచలం, జనరల్ మెడిసన్ పి.విజయ్ కుమార్, పాడేరు డీసీహెచ్ కె.కృష్ణారావు, స్థానిక వైద్యాధికారిణి జ్ఞానేశ్వరి పరిశీలించారు. ఈ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని ఎంపీడీవో ఏవీవీ.కుమార్ తెలిపారు.

సమస్యలపై అర్జీల వెల్లువ

- కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహణ
- జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 211 మంది రాక
- ప్రతి ఒక్కరితో మాట్లాడిన కలెక్టర్ విజయకృష్ణన్


కలెక్టరేట్‌లో అర్జీని పరిశీలిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్


పోలీస్ కార్యాలయంలో అర్జీదారుతో మాట్లాడుతున్న ఏఎస్పీ దేవప్రసాద్

అనకాపల్లి కలెక్టరేట్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. ఇక్కడి కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. తొలుత ఆమె మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీని అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. అనంతరం ఆయా శాఖలకు పంపించి మూడు రోజుల్లో పరిష్కారం చూపాలని సూచించారు. వీటిపై ప్రతి రోజూ అధికారులతో సమీక్షలు జరపాలన్నారు. అనంతరం ఆమె పలువురి నుంచి అర్జీలను స్వీకరించి, వారితో స్వయంగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 211 మంది విచ్చేసి అర్జీలను సమర్పించారు. డీఆర్వో సత్యనారాయణరావుతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో...

జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పలువురి నుంచి ఏఎస్పీ దేవప్రసాద్ అర్జీలను స్వీకరించారు. ప్రతి ఒక్కరితో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం ముగిసే సమయానికి 30 మంది అర్జీలను సమర్పించారు. వీటన్నింటిపై సమగ్ర విచారణ జరిపి పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. అర్జీల్లో అధికంగా భూ తగాదాలు, కుటుంబ కలహాలు, మోసాలకు సంబంధించి ఉన్నట్టు పోలీస్ అధికారులు తెలిపారు.

తరచూ ఇలా.. స్పందించకుంటే ఎలా..?

- అనకాపల్లిలో పలు రోడ్లపై ఎక్కడికక్కడ చెత్త కుప్పలు
- జీవీఎంసీ పారిశుధ్య నిర్వహణ తీరుపై ఆగ్రహం
- వెంటాడుతున్న అంటువ్యాధుల భయం


గవరపాలెం జగన్నాథస్వామి ఆలయం వద్ద రోడ్డుపై ఉన్న చెత్త కుప్ప


ఉడ్‌పేటలో రోడ్డుపై..


డీసీఎంఎస్ కార్యాలయానికి ఎదురుగా ఉన్న రోడ్డుపై...

అనకాపల్లి టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో పారిశుధ్య నిర్వహణ పనుల తీరుపై పలువురు పెదవి విరుస్తున్నారు. పలు రోడ్లపై ఎక్కడికక్కడ చెత్తాచెదారం దర్శనమిస్తుండడమే ఇందుకు కారణంగా చెపుతున్నారు. పారిశుధ్యం మెరుగుకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని జీవీఎంసీ ఉన్నతాధికారులు పదేపదే చెబుతున్నా అనకాపల్లి జోన్‌లో ఉన్న అధికారులు మాత్రం సరిగా స్పందించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అనకాపల్లిలో రోజుకు ఎనభై నుంచి తొంభై టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. ఆదివారం సెలవు దినం కావడంతో ఎక్కడ చెత్త కుప్పలు అక్కడే పేరుకుపోయాయి. సోమవారం పలుచోట్ల సిబ్బంది చెత్తను తొలగించినా చాలాచోట్ల చెత్త కుప్పలు ఉండిపోవడాన్ని చూసి పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఆయా ప్రాంతాలవారు దుర్వాసన భరించలేకపోతున్నారు. అంతేకాకుండా చెత్తను వీధికుక్కలు చిందరవందర చేస్తుండడంతో అక్కడి వాతావరణం మరింత పాడవుతోంది. ఫలితంగా ఆయా ప్రాంతాల్లో రాకపోకలు సాగించే పాదచారులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఈ ప్రాంతాల్లో మరీ దారుణం

గవరపాలెంలోని జగన్నాథస్వామి ఆలయం, వేల్పుల వీధి డౌన్, ఉడ్‌పేట, డీసీఎంఎస్ కార్యాలయం రోడ్లతో పాటు పలుచోట్ల చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. నిత్యం జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో ఇటువంటి వాతావరణాన్ని చూసిన పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రం కావడంతో వివిధ పనులపై ఇక్కడికి వచ్చే ప్రజలు చెత్తకుప్పలను చూసి ముక్కున వేలేసుకుంటున్నారు. ఇక్కడే పారిశుధ్య పరిస్థితి ఇలా ఉంటే.. ఇక గ్రామాల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని చర్చించుకుంటున్నారు.

జీవీఎంసీలో విలీనమయ్యాక తగ్గిన సిబ్బంది

గతంలో అనకాపల్లి మున్సిపాలిటీగా ఉన్నప్పుడు 280 మంది వరకు పారిశుధ్య కార్మికులు పనిచేసేవారు. జీవీఎంసీలో వీలైనమైన తరువాత అనకాపల్లి జోన్‌లో గృహ సముదాయాలు పెరగడంతో పాటు విస్తీర్ణం కూడా పెరిగింది. అయితే ప్రస్తుతం జీవీఎంసీ అనకాపల్లి జోన్‌లో సుమారు వంద మంది పర్మినెంట్ కార్మికులు, మరో వంద మంది ఔట్‌సోర్సింగ్ కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో కొంతమందికి సకాలంలో వేతనాలు అందించకపోవడంతో వారు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ కారణంగానే కొందరు కార్మికులు కూడా పారిశుధ్య పనులను అసంతృప్తితో చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పండుగ సీజన్ కావడంతో వెంటనే స్పందించాలి

సంక్రాంతి పండుగ సమీపిస్తున్న తరుణంలో అవసరమైన సరుకుల కొనుగోలుకు పరిసర గ్రామీణ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు ఇక్కడికి విచ్చేస్తుంటారు. చెత్త కారణంగా వారితో పాటు పట్టణవాసులకు ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా జీవీఎంసీ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాల్సిందిగా అంతా కోరుతున్నారు.

ఇదిలావుంటే, చెత్త సమస్యను శానిటేషన్ సూపర్‌వైజర్ రవి వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా, ఎప్పటికప్పుడు చెత్తను తొలగిస్తున్నామన్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో రెండు రోజుల చెత్త అధికం కావడం వల్ల పలుచోట్ల ఉండిపోయి ఉంటుందన్నారు. మంగళవారం నాటికి పరిశుభ్రంగా తీర్చిదిద్దుతామని తెలిపారు.

మూలపేటలో తాగునీటి సమస్యపై వినతి


ఎంపీడీవోకు నాయకుల వినతి

తుమ్మపాల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మూలపేటలో పదిహేను రోజులుగా మంచినీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఏఐటీయూసీ జిల్లా నాయకుడు కోన లక్ష్మణ తెలిపారు. సోమవారం ఎంపీడీవోకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ ఆయన సందర్భంగా మాట్లాడుతూ ఇంటింటి కుళాయిల పేరుతో గ్రామంలో ఉన్న కుళాయిలను తొలగించడంతో తాగునీటి కష్టాలు ఏర్పడ్డాయన్నారు. గ్రామానికి అవసరమైన చేతి బోర్లు కూడా లేకపోయినట్టు చెప్పారు. తక్షణమే అధికారులు ఈ సమస్యపై స్పందించాల్సిందిగా కోరారు. అంతవరకు ట్యాంకర్లు ద్వారా గ్రామ ప్రజలకు అవసరమైన నీటిని సరఫరా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకుడు సూదికొండ మాణిక్యాలరావు పాల్గొన్నారు.

భూ సమస్యలకు 45 రోజుల్లో పరిష్కారం


పైడివాడలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ చిన్నికృష్ణ

సబ్బవరం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యలకు 45 రోజుల్లో పరిష్కారం చూపుతామని తహసీల్దార్ బి.చిన్నికృష్ణ తెలిపారు. మండలంలోని పైడివాడ, ఇరువాడ గ్రామాల్లో సోమవారం రెవెన్యూ సభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమకు అందిన ప్రతి అర్జీని ఆన్‌లైన్ చేస్తామన్నారు. మార్చిలో రెండో విడత రీ సర్వే చేపడతామని చెప్పారు. అనంతరం పలువురి నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ గణపతిరావు, ఎంఈవో కె.ఎం.రెడ్డి, సర్పంచ్‌లు వడ్డాది అప్పలరాజు, బలిరెడ్డి లక్ష్మి, ఎంపీటీసీలు శీరం అప్పలరాజు, కర్రి అప్పారావు, వీఆర్వోలు జగన్నాథరావు, కామరాజు, సర్వేయర్లు రాంబాబు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న యూనియన్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు

సబ్బవరం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : పీఆర్‌టీయూ ముద్రించిన నూతన సంవత్సరం క్యాలెండర్లను నంగినారపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ మండల అధ్యక్షుడు అప్పలనాయుడు, ప్రధాన కార్యదర్శి భాస్కరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం సాగిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పోకూరి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పైల దేముడు, బొడ్డు అర్జున, సూర్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని పర్యటనను విజయవంతం చేయండి

- కూటమి ముఖ్య నాయకుల సమావేశంలో ఎమ్మెల్యే కొణతాల


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల, చిత్రంలో పీలా గోవింద తదితరులు

కొత్తూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని నరేంద్రమోదీ ఈ నెల ఎనిమిదో తేదీన చేపట్టనున్న విశాఖపట్నం పర్యటనను అంతా విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం ఇక్కడి రింగురోడ్డులో ఉన్న జనసేన కార్యాలయంలో కూటమి ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. సుమారు 80 వేల కోట్లతో ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టుకు, నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్కుకు ప్రధాన మంత్రి శంకుస్థాపన చేయనున్నారన్నారు. ప్రధాని బహిరంగ సభకు అనకాపల్లి నియోజకవర్గం నుంచి అత్యధిక సంఖ్యలో ప్రజలు హాజరు కావాలని ఆయన కోరారు. ప్రతి బస్సుకు ఒక కూటమి నాయకుడ్ని ఇన్‌చార్జిగా నియమిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని ఇరువాడలో గల జీఎస్ కన్వెన్షన్ హాల్‌లో మంగళవారం ఉదయం తొమ్మిది గంటలకు కూటమి పార్టీల శ్రేణుల సమావేశం జరగనుంది. ప్రధాన మంత్రి మోదీ బుధవారం పర్యటన ఉన్న నేపథ్యంలో ఏర్పాట్లు, జన సమీకరణ తదితరాలపై చర్చించేందుకు ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి పుల్లారావు, పంచకర్ల రమేశ్‌బాబు, ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ హాజరు కానున్నారు. నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ హాజరు కావాల్సిందిగా టీడీపీ నాయకులు ఒక ప్రకటనలో కోరారు.

స్టీల్ ప్లాంట్‌పై మోదీ స్పష్టమైన ప్రకటన చేయాలి : సీఐటీయూ



పరవాడలో సీఐటీయూ శ్రేణుల నినాదాలు

పరవాడ : విశాఖలో ప్రధాని మోదీ పర్యటనను అడ్డుకోవాలని పిలుపునిస్తూ సీఐటీయూ నాయకులు సోమవారం పరవాడలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయడం లేదని మోదీ స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు వ్యతిరేకంగా ఉన్న నాలుగు చట్టాలను వెనక్కి తీసుకోవాలని, ముఠా, ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. నాయకులు వి.రవి, పి.అప్పలరాజు, జి.శ్రీనివాసరావు, బి.రమేష్, ఎం.శ్రీనివాసరావు, వి.దేవా, టి.పైడంనాయుడు, కె.శివ, టి.నాయుడు, శంకరరావు, చిన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని పర్యటన నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలు : డీఎస్పీ సత్యనారాయణ

పరవాడ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని మోదీ బుధవారం విశాఖ పర్యటన నేపథ్యంలో లంకెలపాలెం కూడలి పైనుంచి రాకపోకలు సాగించే వాహనాలకు ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయని పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మంగళవారం రాత్రి తొమ్మిది నుంచి బుధవారం రాత్రి పది గంటల వరకు ఆంక్షలు కొనసాగుతాయన్నారు. అనకాపల్లి నుంచి జాతీయ రహదారి లంకెలపాలెం కూడలి మీదుగా విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం వెళ్లే వాహనాలు లంకెలపాలెం నుంచి పెదముషిడివాడ, అనకపల్లి, సబ్బవరం మీదుగా పెందుర్తి హైవే కు మళ్లించడం జరుగుతుందన్నారు. బుధవారం ఉదయం ఆరు గంటల నుంచి నేరుగా లంకెలపాలెం మీదుగా విశాఖ సిటీలో ప్రవేశానికి ఎలాంటి వాహనాలకు అనుమతి లేదన్నారు. కేవలం అంబులెన్స్‌లు, పాల ట్యాంకర్లు, ప్రధాని పర్యటనకు వెళ్లే వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. వాహనదారులు గమనించి పోలీస్ శాఖకు సహకరించాలని డీఎస్పీ కోరారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంగళవారం రాత్రి తొమ్మిది నుంచి లంకెలపాలెం కూడలి వద్ద పోలీస్ సిబ్బంది బందోబస్తు ఉంటుందని, వాహనదారులు ట్రాఫిక్ ఆంక్షలకు అనుగుణంగా రాకపోకలు సాగించాలన్నారు.

కృష్ణావతారంలో వేంకటేశ్వరస్వామి



అనకాపల్లి టౌన్/కశింకోట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ధనుర్మాసోత్సవాలు అనకాపల్లి గాంధీనగరం అంజయ్య కాలనీలో గల వేంకటేశ్వర ఆలయం, కశింకోటలోని వెంకటేశ్వర ధ్యాన మందిరంలో నేత్రపర్వంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా స్వామి సోమవారం కృష్ణావతారంలో దర్శనమిచ్చారు. తొలుత ఆయా ఆలయాల ప్రధానార్చకులు రేజేటి చక్రవర్తి, శ్రీరామా చరణాచార్యులు, మారుతి వెంకటాచార్యులు ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు జరిపారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా సాయంత్రం పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటయ్యాయి.

తుమ్మపాలలో పారిశుధ్య సమస్యపై ఆగ్రహం

- గ్రామ సభలో పలువురు గళం



పంచాయతీ అధికారులకు సమస్యను వివరిస్తున్న స్థానికులు

తుమ్మపాల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం తుమ్మపాలలో సమస్యలను తక్షణమే పరిష్కరించాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. సోమవారం ఇక్కడ జరిగిన గ్రామ సభలో పలువురు గ్రామస్థులు ప్రజాప్రతినిధులపై మండిపడ్డారు. గ్రామాన్ని పారిశుధ్య సమస్య పీడిస్తుందని పలువురు ఆరోపించారు. పంచాయతీ అధికారులు మొక్కుబడిగా పారిశుధ్య పనులు చేపడుతూ చేతులు దులుపుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి సమస్య సైతం వెంటాడుతోందన్నారు. అనంతరం గ్రామ సర్పంచ్ పెంటయ్యనాయుడు మాట్లాడుతూ పారిశుధ్య సిబ్బంది కొరతతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని వివరించారు. అయినప్పటికీ ఎప్పటికప్పుడు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తూ పారిశుధ్య పనులు చేపడుతున్నామని చెప్పారు. గ్రామంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు తీర్మానాలు చేశామని, ప్రతి సమస్యను పరిష్కరిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పంచదార్ల కన్నారావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కశింకోట అభ్యుదయ పాడి రైతుకు పురస్కారం


అప్పలనాయుడుకు జ్ఞాపిక అందిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

కశింకోట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : తెలుగు రాష్ట్రాల్లో రైతులను గౌరవించేందుకు గుంటూరు విజ్ఞాన యూనివర్శిటీ, రైతు నేస్తం సంయుక్త ఆధ్వర్యంలో సంక్రాంతి పురస్కారాలను అందజేసే కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కశింకోటకు చెందిన అభ్యుదయ పాడి రైతు ఆళ్ల అప్పలనాయుడు రాష్ట్ర వ్యవసాయ, పాడి పరిశ్రమ శాఖా మంత్రి కింజరపు అచ్చెంనాయుడు, గుంటూరు పార్లమెంటు సభ్యుడు లావు శ్రీకృష్ణ దేవరాయలు చేతులమీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా అప్పలనాయుడుకు శాలువా కప్పి మెమొంటోతో పాటు ప్రశంసాపత్రాన్ని అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో రైతు నేస్తం ఫౌండేషన్, చైర్మన్ పద్మశ్రీ అవార్డు గ్రహీత ఎండ్లపల్లి వెంకటేశ్వరరావు, విజ్ఞాన యూనివర్శిటీ అధినేత డాక్టర్ రావు రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్ఆర్, నాగార్జున క్యాలెండర్లు ఆవిష్కరణ


నాగార్జున చిత్రాలున్న క్యాలెండర్ల ఆవిష్కరణలో అభిమానులు

అనకాపల్లి టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో సోమవారం నాటి సినీ హీరో అక్కినేని నాగేశ్వరరావు, ప్రముఖ హీరో నాగార్జునల ఫొటోలతో ముద్రించిన నూతన సంవత్సరం క్యాలెండర్లను గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అభిమానులు బుద్ద అప్పారావు, మళ్ల నరసింగరావు, నవీన్ ప్రసాద్, పీడీ ప్రసాద్, భానుచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు అమృతపురం రోడ్డుకు మోక్షం

- ఆక్రమణలు తొలగించి, వాడుక నీరు చెరువుకు మళ్లించేలా ఏర్పాట్లు


గండివారి కొంపలు వద్ద రోడ్డుకు ఇరుప్రక్కలా వేస్తున్న పైపులు

సబ్బవరం, జనవరి 6 (ఆంధ్ర జ్యోతి) : మండల కేంద్రం సబ్బవరంలోని జోడు గుళ్ల జంక్షన్ నుంచి అమృతపురం వెళ్లే రహదారికి ఎట్టకేలకు మోక్షం కలిగింది. గండి వారి కొంపలు వద్ద రోడ్డుకు ఇరువైపులా ఆర్‌అండ్‌బీ స్థలాలు ఆక్రమణకు గురికావడంతో వాడుక నీటితో పాటు వర్షపు నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో రోడ్డు పాడై ఎక్కడికక్కడ గోతులమయంగా మారింది. రాకపోకలకు జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై పలుమార్లు 'ఆంధ్రజ్యోతి' కథనాలను ప్రచురించింది. దీనిపై స్పందించిన పంచాయతీ సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, పాలక వర్గ సభ్యులు వారం రోజులుగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించే పనులు చేపట్టారు. ఇరువైపులా ట్రెంచ్ ఏర్పాటు చేశారు. ఇళ్లు ఉన్న చోట సిమెంటు గొట్టాలు అమర్చుతున్నారు. వాటి ద్వారా వాడుక నీరు, వరద నీరు ఆ సమీపంలో ఉన్న చెరువులోకి పారేలా ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పల్లెల్లో వేకువనే భక్తి సుగంధం

- మేలుకొలుపు ద్వారా ధనుర్మాస పూజలు


వాడచీపురుపల్లిలో సీతారాముల ఉత్సవ విగ్రహాల ఊరేగింపు


నాయుడుపాలెంలో వేకువనే గ్రామస్థుల మేలుకొలుపు

పరవాడ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : సంస్కృతీ, సంప్రదాయాలకు పుట్టినిల్లైన మనదేశంలో ప్రతి దానికి ప్రత్యేకత ఉంది. మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో విష్ణుమూర్తిని పూజించేది ధనుర్మాసంలోనే. ఈ మాసం అంటే విష్ణుమూర్తికి అత్యంత ఇష్టం. పూర్వం ధనుర్మాసం వచ్చిందంటే అన్ని గ్రామాల రామాలయాల్లో వేకువజాము నుంచే మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు చేసేవారు. ఇందులో భాగంగానే 'మేలుకొలుపు' కార్యక్రమాన్ని నిర్వహించేవారు. ప్రస్తుతం పరవాడ, బొద్దపువానిపాలెం, వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, వెన్నెలపాలెం, లంకెలపాలెం గ్రామాల్లో మేలుకొలుపు కార్యక్రమాలు జరుగుతున్నాయి. మండల కేంద్రం పరవాడలో గత తొమ్మిదేళ్లుగా సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రమం తప్పకుండా నిర్వహిస్తూ ప్రాచీన సంప్రదాయానికి పెద్ద పీట వేస్తున్నారు. గ్రామానికి చెందిన మహిళలు, ఫౌండేషన్ సభ్యులు 60 మంది కలిసి ఒక బృందంగా ఏర్పడి ప్రతి రోజూ సుప్రభాత సేవచేస్తున్నారు. రోజూ వేకువజామున నాలుగు గంటలకు నిద్రలేచి 4.30 నుంచి స్థానిక రామాలయంలో సుప్రభాత సేవలు ప్రారంభించి మేలుకొలుపు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. సీతారాముల చిత్రపటాన్ని మహిళలు చేతపట్టుకొని, రాములవారిని పల్లకీలో ఉంచి గ్రామ పురవీధుల్లో భక్తి పాటలు పాడుతూ భజనలు చేస్తూ గ్రామం మొత్తం తిరిగి సూర్యోదయానికి ముందే తిరిగి రామాలయానికి చేరి గోవింద నామస్మరణతో స్వామివారికి హారతి సమర్పిస్తున్నారు. ఈ నెలరోజులు ఉదయం, సాయంత్రం రామాలయంలో భజనలు చేస్తూ భక్తి పాటలు ఆలపిస్తున్నారు. భోగి, సంక్రాంతి పండగలను గ్రామంలో ఘనంగా నిర్వహించి ధనుర్మాస వ్రతాన్ని పూర్తి చేస్తారు.

'ప్రైవేటు స్థలంలో అనధికారికంగా చర్చి నిర్వహణ'

కశింకోట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కశింకోట గోవిందరావు కాలనీలో గల ఓ ప్రైవేటు స్థలంలో ఇతర అవసరాల కోసమని పంచాయతీ నుంచి ప్లాన్ తీసుకొని ప్రస్తుతం చర్చి నిర్వహణ చేపడుతున్నారని కాలనీకి చెందిన ఎస్.ఎస్.ఎస్. అప్పారావు, ఎ.లోవరాజు, ఆర్.త్రినాథ్, జ్ఞానకుమార్, పి.శ్రీను, సందీప్, కె.గణేష్ తదితరులు సోమవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. కాలనీ అసెస్మెంట్ నెంబరు 3640, డోర్ నంబరు 24-179లో ఉన్న ప్రైవేటు స్థలంలో అనధికారికంగా చర్చి నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. స్థానికులకు ఇబ్బంది కలిగించే వారి చర్యలను నిరోధించి, భవిష్యత్తులో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వారు అధికారులను కోరారు.

అప్పన్న ఆలయ హుండీల ఆదాయం రూ.1.94 కోట్లు

సింహాచలం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న స్వామి ఆలయ హుండీల లెక్కింపు సోమవారం నిర్వహించారు. గత 28 రోజులకు గాను రూ. 1.94 కోట్ల ఆదాయం స్వామివారి ఖజానాకు చేరింది. నగదు రూపంలో రూ.1,94,40,202. బంగారం 46 గ్రాములు, వెండి 9.53 కిలోలు రాగా 12 దేశాలకు చెందిన విదేశీ కరెన్సీ నోట్లు కూడా కానుకల రూపంలో వచ్చాయని ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు, సేవకులు పాల్గొన్నారు.

వింటేజ్ బైక్స్ C/o. రవి శంకర్‌రెడ్డి

పాత బైక్‌లపై వల్లమాలిన అభిమానం

ఆనాటి బైక్‌లపై విశాఖలో సూపర్‌రైడ్









లాంబ్రెట్టా స్కూటర్, జావా బైక్



ఎం 80

విశాఖపట్నం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): అతనికి పాత తరం వస్తువులంటే ప్రాణం. వాటిని మూలన పడేయకుండా వినియోగంలో ఉంచడం మరీ ఇష్టం. తన తండ్రికి కూడా ఉన్న ఈ ఇష్టాన్ని కొనసాగిస్తూ వింటేజ్ బైకులకు తన ఇంటిని చిరునామాగా మార్చారు. ఇతని వద్ద ఒకటి రెండూ కాదు ఏకంగా 32 పాతతరం ద్విచక్ర వాహనాలున్నాయి. వాటిలో 28 కండిషన్‌లో ఉండగా, ఒక్కో దానిపై నగరంలో షికారు చేస్తుంటారు. నిర్వహణకు ఏటా రూ.2 లక్షలు ఖర్చవుతున్నా వెరవకుండా వాటిని కన్నబిడ్డలా సాకుతున్నారు రెడ్డికంచరపాలేనికి చెందిన బసవశంకరరెడ్డి.

- తండ్రికి ఇచ్చిన మాట కోసం భద్రం చేస్తున్న వైనం
- నిర్వహణకు ఏటా రూ.2 లక్షల వరకు ఖర్చు
- అతని వద్ద ఇప్పటికే 32 వాహనాలు.. కండిషన్‌లో ఉన్నవి 28
- నాటి లాంబ్రెట్టా నుంచి నిన్నటి టీవీఎస్ 50 వరకు
- ఇల్లే పార్కింగ్ స్థలంగా మార్పు
- కండిషన్‌లో ఉంచేందుకు ప్రత్యేకంగా సమయం కేటాయింపు

ఏదైనా ఒక వాహనం కొనుగోలు చేస్తే పది, పదిహేనేళ్లు వినియోగిస్తాం. తరువాత మరమ్మతుల భారాన్ని భరించలేక విక్రయిస్తాం. అందరిలా చేస్తే ప్రత్యేకత ఏముంది అనుకున్నారో ఏమో బసవ శంకరరెడ్డి. ఏకంగా 60 ఏళ్ల కిందటి నుంచి కొనుగోలు చేసిన వాహనాలను భద్రపరుస్తున్నారు. వాటిని మూలనచేర్చి అప్పుడప్పుడు శుభ్రంచేసి వదిలేయడం కాదు. ఇప్పటికీ రన్నింగ్ కండిషన్‌లో ఉంచుతున్నారు. ఇందుకోసం ఏటా రూ.2 లక్షలు ఖర్చు చేస్తూ తన ఇంటిని వింటేజ్ బైకులకు అడ్డాగా మార్చుకున్నారు రెడ్డికంచరపాలేనికి చెందిన బసవ రవిశంకరరెడ్డి వద్ద ప్రస్తుతం 32 వింటేజ్ బైకులుండగా, వీటిలో నాలుగు మినహా అన్నీ కండిషన్‌లో ఉన్నవే. ఈ బైకుల మోడల్స్ ఎప్పుడెప్పుడు కొనుగోలు చేశారు.. నిర్వహణ ఇబ్బందులు, ఇంటికి చేరిన ప్రతి బైకును ఎందుకు భద్రపరుస్తున్నారో ఇలా చెప్పుకొచ్చారు.

తండ్రికిచ్చిన మాట మేరకు..

బసవ రవిశంకరరెడ్డి పాలిటెక్నిక్ చదివే సమయం నుంచి టెక్నికల్ అంశాలపై శ్రద్ధ చూపేవారు. ఎలక్ట్రికల్ వస్తువుల తయారీపైనా శ్రమించేవారు. తండ్రి అప్పల స్వామిరెడ్డి మెకానికల్ ఇంజనీర్‌గా పనిచేయడం వల్ల అందులో ఆసక్తి పెరిగింది. తండ్రికి చిన్నప్పటి నుంచి బైకులు అంటే ఇష్టం. అప్పట్లో మార్కెట్‌లోకి వచ్చే ప్రతి బైకును కొనుగోలు చేసేవారు. అలా తొలిసారి 1957లో చెకోస్లోవాకియాకు చెందిన జావ్ 250 సీసీ బైకును కొనుగోలు చేశారు. 2011లో ఆయన మృతిచెందే సమయంలో శంకరరెడ్డికి ఓ మాట చెప్పారు. 'నువ్వున్నంత కాలం బైకులను అమ్మవద్దని, నిర్వహణను చూసుకోవాలి' అని. ఈ మేరకు అప్పటికే ఆయన కొనుగోలు చేసిన 28 బైకులను శంకరరెడ్డి జాగ్రత్తగా చూసుకుంటూ, మరో నాలుగు పాత బైకులను కొనుగోలు చేశారు.



యజ్డీ బైక్



మోఫాపై రవిశంకర్

బైకుల కోసం భవనం..

సాధారణంగా బైకులను పార్కింగ్ ఏరియాలో ఉంచుతాం. కానీ ఇతని వద్ద అధికసంఖ్యలో ఉండడంతో ఏకంగా ఓ భవనాన్ని కేటాయించారు. వాహనాలన్నింటికీ కుటుంబసభ్యులుగానే చూసుకుంటారు. అప్పట్లోనే వీటికోసం రూ.లక్షల్లో వెచ్చించారని చెబుతున్నారు.

ప్రతి బైకుకూ ఓ ప్రత్యేకత..

రవిశంకర్‌రెడ్డి వద్ద ప్రస్తుతం 32 బైకులున్నాయి. వీటిలో 28 కండిషన్‌లో ఉన్నాయి. ఈయన రాజస్థాన్‌లో ని ఓ అమెరికన్ కంపెనీలో సీనియర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నారు. మూడు వారాలకు ఒకసారి ఇంటికి వచ్చి ఇక్కడ మూడువారాలు ఉంటారు. ఒక్కోరోజు ఒకో బైకుతో షికారు చేస్తారు. బైకు కండిషన్ తెలుసుకునేందుకు రైడ్ తప్పనిసరి అంటారు. ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే పరిష్కరిస్తారు. ప్రస్తుతం 28 బైకులు కండిషన్‌లో ఉండగా.. ఒక్కో బైకుది ఒక్కో ప్రత్యేకతంటారు. ఆఫ్ రోడ్ కింగ్‌గా పేర్గాంచిన రాజ్‌దూత్‌ను 1980లో కొనుగోలు చేశారని, దీనిపై రైడ్ చేస్తే మస్త్ మజా అన్నారు. దీనిపై పొలాల్లో కూడా జెట్ స్పీడుతో దూసుకుపోవచ్చునని చెబుతారాయన. 1959లో మార్కెట్‌లోకి వచ్చిన మోడల్ లాంబ్రెటా 150 సీసీ నుంచి లేటెస్ట్ మోడల్ బైకులన్నింటినీ కొన్నారు. వీటిలో లాంబ్రెటా 175 సీసీ, లాంబ్రెటా 50 సీసీ, జావా 250 సీసీ, సువేగా మోపెడ్ 50 సీసీ, టీవీఎస్ మోపెడ్ 50 సీసీ, బజాజ్ ప్రియ 150 సీసీ, యమహా ఆర్ఎక్స్ 100, ఏఎక్స్ 100, సీడీ100, కేబీ100, డీజిల్ బుల్లెట్ 325 సీసీ, రాజ్ దూత్ బిగ్ 150 సీసీ, రాజ్‌దూత్ డీటీఎస్ 150 సీసీ, టూనా 50 సీసీ, హీరో హోండా స్ట్రీట్ 100 సీసీ, ఎన్‌ఫీల్డ్ సిల్వర్ ప్లస్ 50 సీసీ, బజాజ్ ఎం80 80 సీసీ, బజాజ్ సన్నీ 80 సీసీ, విజయ్ పుష్పక్ 150 సీసీ, కైనటిక్ హోండా జాయ్ 100 సీసీ, మోఫా (ఎన్‌ఫీల్డ్) 22 సీసీ, యెజ్డి క్లాసిక్ 250 సీసీ, ఇదే మోడల్‌లో మరోబైక్‌ను 1980లో తీసుకున్నారు. వీటితోపాటు ఎల్ఎంఎల్ వెస్పా 150 సీసీ, ఎల్ఎంఎల్ టీ ఫైవ్‌మోడల్ (తొలి ఇండియన్ సెల్ఫ్ స్టార్ స్కూటర్) ఈయన గ్యారేజీలో ఉన్నాయి.



ఈటీ, బజాజ్ సన్నీ

ఇల్లంతా బైకులే..

అతని ఇంట్లో ఎటు చూసినా బైకులే. వీటిలో మినీ బైకులు ఉన్నాయి. గోడలపైనా, ఇంటి మధ్యలో బైకులను అందంగా ఉంచారు. ఎలక్ట్రికల్, మెకానికల్ వస్తువుల తయారీపై ఇతనికి మక్కువ. ఇంట్లోని ప్రతి లైటు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌తో ఆపరేట్ చేసేలా డిజైన్ చేశారు. సుదూర ప్రాంతాల నుంచి ఫ్యాన్లు, లైట్లను రిమోట్ ద్వారా ఆపరేట్ చేస్తారు. శబ్దాల ద్వారా ఆపరేట్ చేసేలా ప్రత్యేకమైన ఎలక్ట్రికల్ వ్యవస్థను డిజైన్ చేశారు.

నాన్న కోరికను ఇష్టంగా మార్చుకున్నా



నాన్నకు బైకులు ఇష్టం. తొలిసారి 1957లో ఇంటికి బైకు వచ్చింది. ఆ తరువాత మార్కెట్‌లోకి వచ్చే భిన్నమైన బైకులన్నీ చేరాయి. నేనై వింటేజ్ బైకులను కొనుగోలు చేశాను. ఇప్పటికీ మా ఇంట్లో ఓల్డ్ బైకులే ఉంటాయి. న్యూ మోడల్ తీసుకోలేదు. నాన్న చనిపోయే ముందు బైకులు అమ్మవద్దని చెప్పారు. షూటింగ్ చేయడానికి కొందరు అడిగారు. కానీ, ఇవ్వలేదు. ఎవరో హీరో వాడిన బైకు అని అనుకోకూడదు. నాదిగానే గుర్తింపుండాలి. కువైట్ నుంచి 2002లో యమహా ఆటో గేర్ బైక్ తీసుకురావడానికి ఎక్కువ ఖర్చుయింది. వీటితోపాటు పాతతరం బీరువాలు, ఇతర వస్తువులు ఉన్నాయి. పాత వస్తువులపై మమకారం పెరిగింది. కొనసాగిస్తున్నాను.

- బసవ రవిశంకర రెడ్డి, వింటేజ్ బైక్స్ యాజమాని

క్రైం... crime news

మూడు కిలోల గంజాయితో ముగ్గురి అరెస్టు

అనకాపల్లి టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కొత్తూరు పంచాయతీ పరిధిలో ఏలేరు కాలువ వద్ద ముగ్గురు యువకుల నుంచి మూడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు పట్టణ ఎస్ఐ డి. ఈశ్వరరావు తెలిపారు. అనకాపల్లి పట్టణంలోని విజయరామరాజుపేటకు చెందిన కొల్లిబంటి శివగోపి, సుబ్రహ్మణ్యం కాలనీకి చెందిన పుడిమి దుర్గాప్రసాద్, గొరింట్ల ప్రసాద్‌కుమార్‌లు ఏజెన్సీలో గంజాయి కొనుగోలు చేసి, ఇక్కడ చిల్లరగా అమ్మకాలు సాగిస్తుంటారని చెప్పారు. రహస్య ప్రదేశంలో గంజాయి ప్యాకెట్లు తయారు చేయడానికి ఏలేరు కాలువ వద్ద ఉండగా తమకు అందిన సమాచారం మేరకు వెళ్లి వారిని అరెస్టు చేసి మూడు కిలోల గంజాయితోపాటు స్కూటీ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసులో మరికొందరి కోసం గాలిస్తున్నామని ఎస్ఐ ఈశ్వరరావు తెలిపారు.

మనస్తాపంతో వ్యక్తి బలవన్మరణం

- మృతుడు అనకాపల్లి వాసి

ఈపూరుపాలెం (చీరాల టౌన్), జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మనస్తాపంతో అనకాపల్లి జిల్లాకు చెందిన ఓ వ్యక్తి బలవన్మరణం చెందాడు. ఈ ఘటన సీఈసీ కళాశాల సమీపంలోని రామాపురం రోడ్డులో ఆదివారం చోటుచేసుకుంది. ఈపూరుపాలెం ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. అనకాపల్లి జిల్లా బుచ్చెయ్యపేట మండలం ఆర్. భీమవరానికి చెందిన కోడూరు వెంకటరావు(35) రామాపురానికి చెందిన జయరాణిను సుమారు పదేళ్ల క్రితం వివాహమాడాడు. ప్రస్తుతం వీరికి ఎనిమిదేళ్ల పాప ఉంది. వెంకటరావు ఎక్స్‌కవేటర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇటీవల మద్యానికి బానిసగా మారాడు. ఈ క్రమంలో నెలకొన్న వివాదాల కారణంగా మనస్తాపం చెందిన అతను ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని బలవన్మరణం చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహానికి మంగళవారం పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించనున్నారు.

రైతుబజార్ కలేనా!

... 5వ పేజీ తరువాయి

కూడా అయిన అయ్యన్నపాత్రుడు చొరవతో రైతు బజార్ ఏర్పాటు కోసం రూ.20 లక్షలతో మరో 12 షాపులు నిర్మించి, విద్యుత్, నీటి సదుపాయాలు కల్పించారు. డ్వాక్రా సంఘాలకు, కొంత మంది రైతులకు దుకాణాలు కేటాయించారు. అయితే కూరగాయ పంటలు పండించే రైతుల్లో ఎక్కువ మంది గొలుగొండ, నాతవరం మండలాలకు చెందిన వారు కావడం, రైతుబజార్ వారికి చాలా దూరంలో వుండడంతో ఇక్కడికి రాలేదు. దీంతో దుకాణాలు నిరూపయోగంగా వున్నాయి. 2020వ సంవత్సరంలో కరోనా వైరస్ ప్రబలినప్పుడు నర్సీపట్నంలోని ఇందిరా మార్కెట్‌ను మూసేసి, వ్యాపారులను ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్దకు, కొంత మందిని పెదబొడ్డేపల్లిలోని రైతు బజార్ తరలించారు. కరోనా వైరస్ తగ్గిపోయిన తరువాత రైతు బజార్‌లోని అన్ని దుకాణాలను కూరగాయల వ్యాపారులకు అద్దెకు ఇచ్చారు. దీంతో రైతు బజార్ కాస్తా కూరగాయల మార్కెట్‌గా మారిపోయింది. తరువాత పెదబొడ్డేపల్లిలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతుబజార్‌ను పునర్ధురిస్తామని వైసీపీ హయాంలో మార్కెటింగ్ శాఖ అధికారులు ప్రకటించారు. కానీ ఐదేళ్ల కాలంలో కార్యరూపం దాల్చలేదు.

రైతు బజార్‌కు ఇందిరా మార్కెట్ అనుకూలం

పెదబొడ్డేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు పట్టణానికి పూర్తిగా తూర్పు వైపున వుంది. కూరగాయ పంటలను సాగు చేసే రైతుల్లో ఎక్కువ మంది గొలుగొండ, నాతవరం మండలాల్లో వున్నారు. ఈ మండలాలు పట్టణానికి నైరుతి, పశ్చిమ దిశల్లో వున్నాయి. దీంతో పెదబొడ్డేపల్లిలోని రైతు బజార్‌కు కూరగాయలు తీసుకువచ్చి అమ్ముకోవడానికి ఈ మండలాల రైతులు ఆసక్తి చూపడంలేదు. పైగా మునిసిపాలిటీలో కొద్ది వార్డులకు మాత్రమే పెదబొడ్డేపల్లి రైతు బజార్ అందుబాటులో వుంది. అందువల్ల ఇందిరా మార్కెట్‌లో రైతుబజార్ ఏర్పాటు చేస్తే రైతులకు, వినియోగదారులకు ఉపయోగకరంగా వుంటుంది. ఇందిరా మార్కెట్‌లో వందకుపైగా దుకాణాలు ఉన్నాయి. కరోనా సమయంలో చాలా మంది వ్యాపారులను డిగ్రీ కళాశాల రోడ్డులోకి తరలించగా, కరోనా తగ్గిన తరువాత వారు అక్కడే వ్యాపారాలను కొనసాగిస్తున్నారు. దీంతో ఇందిరా మార్కెట్‌లో కిరాణా దుకాణాలు, ఒకటీ అరా కూరగాయల దుకాణాలు మాత్రమే వున్నాయి. మిగిలిన షాపులన్నీ ఖాళీగా పడివున్నాయి. ఇందిరా మార్కెట్‌లో రైతు బజార్ ఏర్పాటు చేస్తే అందరికీ అందుబాటులో ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

దివ్యాంగ పింఛన్ల తనిఖీ

... 5వ పేజీ తరువాయి

సాధించి పింఛన్ పొందుతున్నారు. దివ్యాంగ పింఛన్ మంజూరుకు అవసరమైన సదరం సర్టిఫికెట్‌ను జారీ చేసేందుకు కొన్ని మండలాల్లో వైద్యులు, వైసీపీ నేతలు కసిపి రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు వసూలు చేసినట్టు ఆరోపణలు వచ్చాయి. ఈ విషయం జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారుల దృష్టికి వచ్చినప్పటికీ వైసీపీ నేతల పాత్ర వుండడంతో అధికారులు ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బోగస్ పింఛన్‌దారుల గురించి జిల్లా, మండల కేంద్రాల్లో ప్రతి వారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందుతున్నాయి. దీంతో ప్రభుత్వం దివ్యాంగ పింఛన్లపై దృష్టి సారించి వైద్య నిపుణులతో తనిఖీలు చేయాలని నిర్ణయించింది. దీంతో బోగస్ పింఛన్‌దారుల బండారం బయటపడుతుందని అసలైన దివ్యాంగులు అంటున్నారు.

జిల్లా ఓటర్లు 12,91,044

... 5వ పేజీ తరువాయి

ముసాయిదా జాబితాలో జిల్లాలో 12,89,870 మంది ఓటర్లు ఉండగా, తాజాగా విడుదలచేసిన తుది జాబితాలో 12,91,044 మంది ఉన్నారు. ముసాయిదా జాబితాతో పోల్చితే 1,174 మంది ఓటర్లు పెరిగారు. ముసాయిదా జాబితా విడుదల తరువాత కొత్తగా 3,044 మంది ఓటర్లుగా నమోదుచేయగా 1,870 మంది మరణించడం/ డబుల్ ఎంట్రీలు/ వలసపోయినట్టుగా గుర్తించి జాబితాల నుంచి వారి పేర్లను తొలగించామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. గత ఏడాది అక్టోబరు 29న ముసాయిదా జాబితా విడుదలచేసిన నాటికి జిల్లాలో 18 నుంచి 19 సంవత్సరాల వయస్సు కలిగిన ఓటర్లు 16,016 మంది ఉన్నారు. ఆ తరువాత 1,209 మంది కొత్తగా ఓటు కోసం పేర్లు నమోదు చేసుకోవడంతో ఈ సంఖ్య 17,225కు పెరిగింది. ఇదిలావుండగా జిల్లాలో 3,987 మంది సర్వీసు ఓటర్లు ఉన్నారని, వీరిలో పురుషులు 3,851, మహిళలు 136 మంది ఉన్నారని కలెక్టర్ పేర్కొన్నారు. తుది ఓటరు జాబితాలను అసెంబ్లీ నియోజకవర్గాల ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, సహాయ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి/తహసీల్దారు కార్యాలయాలు, పోలింగ్ బూత్‌లలో అందుబాటులో ఉంచామన్నారు.

పంట పండింది!

... 5వ పేజీ తరువాయి

అర్థమైంది. నూర్పుల తరువాత ఎకరాకు 35 నుంచి 40 బస్తాల వరకు అవుతున్నాయి. ఎంటీయూ 1064 రకం ఎకరాకు 25 నుంచి 30 బస్తాల ధాన్యం దిగుబడి వస్తుంది. ఈసారి వాతావరణం అన్ని విధాలా అనుకూలించడంతో మరో పది నుంచి పదిహేను బస్తాలు అధికంగా దిగుబడి వచ్చిందని రైతులు చెబుతున్నారు. వ్యవసాయ అధికారుల సూచన మేరకు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, వర్మీ కంపోస్టు, పశువుల గెత్తాన్ని అధికంగా వేసినట్టు చెప్పారు. దుక్కి దున్నడం నుంచి వరి పంట నూర్పు వరుకు ఎకరాకు రూ.30-35 వేలు ఖర్చు అయ్యింది. బస్తా ధాన్యం (నికరంగా 75 కిలోలు) రూ.1,570కి విక్రయించారు. దీంతో ఎకరాకు రూ.25-30 వేలు మిగిలాయని చెబుతున్నారు.

రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌కు కుసర్లపూడి జడ్పీ పాఠశాల ప్రాజెక్టు



రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో, హెచ్ఎం తదితరులు

రోలుగుంట, జనవరి 6(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కుసర్లపూడి జడ్పీ పాఠశాల విద్యార్థులు తయారు చేసిన సైన్స్ నమూనా రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. ఈ మేరకు నమూనాను తయారు చేసిన విద్యార్థులను, ఉపాధ్యాయులను ఎంఈవో సోమవారం అభినందించారు. ఈ నెల 4న అనకాపల్లిలో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ పోటీల్లో గ్రూపు విభాగంలో కుసర్లపూడి జడ్పీ పాఠశాల విద్యార్థులు ఆర్.అవినాష్, ఎ.భార్గవ్ పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఫైర్ అలారం ప్రాజెక్టును తయారు చేశారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఆటోమేటిక్‌గా అలారం మోగుతుంది. అదే విధంగా వాటర్ ట్యాంక్‌లో ఉన్న నీరు కూడా మంటలను ఆర్పే మోడల్‌ను తయారు చేసి ప్రదర్శించారు. ఈ ప్రాజెక్టు జిల్లా స్థాయిలో గ్రూప్ విభాగంలో రెండవ స్థానం సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. ఈ నెల 7, 8 తేదీల్లో విజయవాడలో నిర్వహించే రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌లో పాల్గొననున్నట్టు ఆ విద్యార్థులు తెలిపారు. ఈ సందర్భంగా గైడ్ టీచర్ చిక్కాల శ్రీనివాసరావు, హెచ్ఎం శెట్టి మోహన్‌రావును ఎంఈవో జగ్గారావు, తదితరులు అభినందించారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు తెనుగుపూడి విద్యార్థి ఎంపిక



రొంగలి తరుణ్

దేవరాపల్లి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని తెనుగుపూడి అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి రొంగలి తరుణ్ జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ పి.రఘు సోమవారం తెలిపారు. ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు మహరాష్ట్ర కొల్హాపూర్ పట్టణంలో జరగబోయే జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో తరుణ్ ప్రాతినిధ్యం వహిస్తున్నాడన్నారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థిని ఇన్‌చార్జ్ డీసీవో జి.గ్రేస్, వ్యాయామ ఉపాధ్యాయుడు జి.తరుణేశ్వరరావు, ఎస్.నాగేశ్వరరావు, బి.వి.రమణమూర్తి అభినందించారు.

భోగాపురం పూర్తికాగానే విశాఖకు విమానాలు బంద్

- కొత్త ఎయిర్‌పోర్టు జూన్ 2026లో ప్రారంభమయితే సెప్టెంబరు నుంచి డొమెస్టిక్ విమానాలకు ఫుల్‌స్టాప్
- రక్షణ అవసరాల కోసం పూర్తిగా స్వాధీనం చేసుకోనున్న నేవీ
- ఫిబ్రవరి నుంచి రాత్రి 11 ఉదయం 7 గంటల మధ్య రాకపోకలు నిలిపివేత

విశాఖపట్నం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం 2026 సెప్టెంబరు నుంచి మూతపడనున్నది. ప్రయాణికుల విమానాలను అనుమతించరు. దీనిని పూర్తిగా తూర్పు నౌకాదళమే రక్షణ అవసరాలకు ఉపయోగించుకుంటుంది. విశాఖ విమానాశ్రయం సలహా కమిటీ సోమవారం ఎంపీ ఎం.శ్రీభరత్ అధ్యక్షతన సమావేశమైంది. ఈ సందర్భంగా భోగాపురంలో కొత్త అంతర్జాతీయ విమానాశ్రయం 2026 జూన్‌లో ప్రారంభమైతే విశాఖ విమానాశ్రయం పరిస్థితి ఏమిటని పలువురు సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. దానిపై విశాఖ నేవీ వైమానిక స్థావరం వ్యవహారాలు పర్యవేక్షిస్తున్న ఐఎన్ఎస్ డేగా అధికారులు, విమానాశ్రయం డైరెక్టర్ రాజారెడ్డి స్పందించారు. అనుకున్న సమయానికి భోగాపురం ప్రారంభమైతే అదే ఏడాది సెప్టెంబరు నుంచి విశాఖ విమానాశ్రయం మూసేస్తామని స్పష్టంచేశారు.

మరో ఎనిమిది నెలలు అందుబాటులో ఉండని ఐఎల్ఎస్

విశాఖ విమానాశ్రయాన్ని నేవీ ఉపయోగించుకుంటున్న సంగతి తెలిసిందే. భవిష్యత్తు అవసరాల కోసం ప్రస్తుతం 10 వేల అడుగుల పొడవు ఉన్న రన్‌వేను నేవీ అధికారులు అటు వేయి అడుగులు, ఇటు 1,000 అడుగుల పొడవు పెంచే పనిలో ఉన్నారు. ఇవి మార్చితో పూర్తవుతాయని భావించారు. కానీ మట్టి స్వభావం వల్ల పనులు ఆలస్యం అవుతున్నాయి. ఆగస్టుకు కాని పూర్తికావని చెబుతున్నారు. ఈ పనులు జరుగుతున్నపుడు విమానాలు దిగడం కోసం ఉపయోగించే 'ఇనుస్ట్రుమెంట్ ల్యాండింగ్ సిస్టమ్(ఐఎల్ఎస్)'ను ఆపేస్తున్నారు. గత కొద్దికాలంగా రన్‌వే విస్తరణ పనులు జరుగుతుండడం వల్ల విమానాలతో ఐఎల్ఎస్ అనుసంధాన ప్రక్రియకు సాంకేతిక అవరోధాలు కలుగుతున్నాయి. రన్‌వే పనులు పూర్తయ్యేంత వరకు ఐఎల్ఎస్ సదుపాయం ఉండదని కూడా నేవీ అధికారులు ఈ సమావేశంలో స్పష్టం చేశారు. అదే విధంగా రన్‌వే పనులు త్వరితంగా పూర్తిచేయడానికి ఫిబ్రవరి నుంచి రాత్రి 11 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు విమానాల రాకపోకలను అనుమతించబోమని నేవీ అధికారులు వెల్లడించారు. విశాఖ విమానాశ్రయానికి అంతర్జాతీయ సర్వీసులు సింగపూర్, బ్యాంకాక్, కౌలాలంపూర్ నుంచి రాత్రి 11 గంటల తరువాతే వస్తున్నాయి. అవి రద్దు కాకుండా ఉండాలంటే... వాటి షెడ్యూళ్లు మార్చుకోవాలని, లేదంటే రాత్రి 12 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు రాకపోకలు నిలిపివేస్తామని నేవీ అధికారులు పేర్కొన్నారు.

స్లాట్లు 12 నుంచి 15కు పెంచడానికి అంగీకారం

విశాఖ విమానాశ్రయంలో రన్‌వేను ప్రస్తుతం అటు పౌర విమానాలకు, అటు నేవీ విమానాలకు ఉపయోగిస్తున్నారు. పౌర విమానాలకు ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు గంటకు 12 స్లాట్లు మాత్రమే ఇస్తున్నారు. అంటే ఆరు విమానాలు వచ్చి, తిరిగి వెళ్లగలుగుతున్నాయి. దీనివల్ల కొత్త విమానాలు రావడానికి అవకాశం ఉండడం లేదు. ఈ నేపథ్యంలో విశాఖ ఎంపీ శ్రీభరత్ స్లాట్ల సంఖ్యను 18కి పెంచాలని నేవీ అధికారులను కోరారు. అన్ని ఇవ్వలేమని 15 వరకూ మాత్రమే ఇస్తామని హామీ ఇచ్చారు.

మంత్రి సత్యకుమార్ నిరాడంబరత

- రోడ్డు పక్కన బండి వద్ద టిఫిన్ చేసిన వైనం



రోడ్డు పక్క బండి వద్ద టిఫిన్ చేస్తున్న మంత్రి సత్యకుమార్, ఇతర బీజేపీ నాయకులు

విశాఖపట్నం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ చాలా సాదాసీదాగా ఉంటారు. హంగు, ఆర్భాటాలకు దూరంగా ఉండేందుకు యత్నిస్తారు. ప్రధాని పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు విశాఖ విచ్చేసిన ఆయన సోమవారం ఉదయం గురుద్వార జంక్షన్ సమీపంలో రోడ్డు పక్కనున్న బండి వద్ద సాధారణ పౌరులతో కలిసి టిఫిన్ చేశారు. ఈ సందర్భంగా పలువురితో సరదాగా మాట్లాడారు. ఆయన వెంట స్థానిక బీజేపీ నాయకులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు 'ఫ్లోర్ క్లీనింగ్ రోబోట్' ఎంపిక



మణికంఠ (ఫైల్ ఫోటో)



మణికంఠ తయారుచేసిన స్మార్ట్ ఫోన్‌తో పనిచేసే 'ఫ్లోర్ క్లీనింగ్ రోబోట్' నమూనా

ఎస్.రాయవరం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి సీహెచ్ మణికంత రూపొందించిన స్మార్ట్ ఫోన్‌తో పనిచేసే ఫ్లోర్ క్లీనింగ్ రోబోట్ నమూనా పరికరం రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్ఎం శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల నాలుగో తేదీన కశింకోటలో నిర్వహించిన జిల్లాస్థాయి విద్య, వైజ్ఞానికి ప్రదర్శనలో మణకంత రూపొందించిన ఈ పరికరం ద్వితీయ బహుమతి సాధించి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. మంగళవారం విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి విద్య, వైజ్ఞానికి ప్రదర్శనలో మణికంత ఈ పరికరాన్ని ప్రదర్శించనున్నాడు. హెచ్ఎంతోపాటు సైన్స్ టీచర్లు లలితాంబ, ఆర్.అప్పలనాయుడు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	102.00
లైవ్ ధర	122.00
విత్ స్కిన్	214.00
స్కిన్ లెస్	224.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	510
విజయనగరం	514
శ్రీకాకుళం	514